‘ఉన్నావో’ దుండగుడికి బెయిల్ రద్దు చేయాలి

- సెంగార్‌కు జీవితఖైదు కొనసాగించాలి
- ఢిల్లీ హైకోర్టు వద్ద ఐద్వా ఆందోళన

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 145 | విజయవాడ, శనివారం 27 డిసెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 27 December 2025 | Rs



హ్యాట్రిక్ విజయం.. సిరీస్ కైవసం

మూడో టి20లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు

3


‘అనంత’లో గన్ కల్చర్

రూ.50 వేలకు ఒక పిస్టల్ అమ్మకం

ముగ్గురు అరెస్టు, ఐదు పిస్టళ్లు, ఏడు మేగజైన్స్ స్వాధీనం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురంలో గన్ కల్చర్ కలకలం రేపుతోంది. రాష్ట్రంలో నేర వాతావరణ పెరగడం పట్ల ప్రజలు భయకంపితులవుతున్న పరిస్థితి ఏర్పడుతోంది. రూ.50 వేలకు ఒక పిస్టల్ విక్రయిస్తున్న ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి ఐదు కంట్రీమేడ్ పిస్టల్స్, ఏడు మేగజైన్స్, 30 బుల్లెట్స్, ఒక తల్వార్ స్వాధీనం చేసుకున్నారు. అనంతపురంలోని ఒక జిమ్ నిర్వాహకుడు తన భార్యను పిస్టల్‌తో బెదిరించిన కేసును ఛేధించే క్రమంలో తీగలాగితే డొంక కదిలినట్టుగా అక్రమ ఆయుధాల సరఫరా వ్యవహారం బయటకొచ్చింది. నిత్యావసర సరుకులు మార్కెట్లో అమ్మినంత సులువుగా తుపాకులను తెచ్చి అమ్మేస్తుండడం సంచలనం రేపుతోంది. ఇందుకు సంబంధించిన వివరాలను అనంతపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్‌పి జగదీశ్ శుక్రవారం వెల్లడించారు. అనంతపురం నగరంలోని ప్రముఖ జిమ్ నిర్వాహకుడు నల్లి రాజశేఖరరెడ్డి ఈ నెల 11న తన భార్యను పిస్టల్‌తో బెదిరించడంతో ఆమె నగరంలోని టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నల్లి రాజశేఖర్‌రెడ్డికి పిస్టల్ ఏ విధంగా వచ్చిందని ఆరా తీశారు. తీగ లాగితే డొంక కదిలినట్టుగా అక్రమ ఆయుధాల విక్రేత ముఠా గుట్టురట్టయింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మొరేనా ప్రాంతానికి చెందిన రోహిత్ పర్మార్, అదే ప్రాంతానికి చెందిన శివసింగ్ పరిహర్ అనే యువకుల నుంచి జిమ్ నిర్వాహకుడు రాజశేఖర్ పిస్టల్ కొనుగోలు చేసినట్టు, దీనితోనే భార్యను బెదిరించినట్లు దర్యాప్తులో తేలింది. నిందితులు గ్వాలియర్ ప్రాంతంలో రూ.30 వేల నుంచి రూ.40 వేలకు కొనుగోలు చేసి రూ.20 వేల నుంచి రూ.30 వేలు అదనపు ధరకు అమ్మి సొమ్ము చేసుకునే వారని గుర్తించారు. జిమ్ పరికరాలు కొనుగోలు చేసేందుందకు రాజశేఖర్ మధ్యప్రదేశ్ వెళ్లినప్పుడు పై ఇద్దరు నిందితులతో పరిచయమైంది. జిమ్‌కు వచ్చే వాళ్లు ఎవరైనా ఇబ్బందిపెడితే వారిని బెదిరించడానికి గన్ అవసరమని భావించి రాజశేఖర్‌రెడ్డి మొదట కొనుగోలు చేశాడు. ఆ తర్వాత వీరి పరిచయం మరింత పెరిగి గన్ కొనాలనుకునే వారికి అమ్మిచ్చే ఉద్దేశంతో వీరు ముగ్గురూ ముఠాగా ఏర్పడినట్టు ఎస్‌పి జగదీశ్ తెలిపారు. గన్స్ అమ్మడానికి వచ్చిన సమయంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరితోపాటు జిమ్ నిర్వాహకుడిని కూడా పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి ఐదు పిస్టల్స్, ఏడు మేగజైన్స్, 30 బుల్లెట్లతోపాటు టెస్టు కోసం వాడిన మూడు ఖాళీ బుల్లెట్లు, ఒక తల్వార్ స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు, ఆయుధాలు

ఎక్కడి నుంచి వచ్చాయి... ఇంకా ఎవరెవరికి విక్రయించారో?

విక్రయించేందుకు తెచ్చిన ముఠా పట్టుబడినప్పటికీ, ఈ పిస్టల్స్ ఎక్కడ తయారయ్యాయి అన్నది ఇంకా తేలలేదు. ఈ ముఠా ఇంకా ఎక్కడెక్కడ ఆయుధాలను విక్రయించిందన్నది కూడా స్పష్టతలేదు. దీనిపై మరింత లోతుగా విచారిస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి జగదీశ్ తెలిపారు. అక్రమ ఆయుధాలు కలిగి ఉండడం తీవ్రమైన నేరమని, ఇటువంటి ఘటనలను ఏ మాత్రమూ సహించబోమని ఆయన హెచ్చరించారు. అక్రమంగా ఆయుధాలు విక్రయించే, సరఫరా చేసే ముఠాలపై నిరంతరం నిఘా పెట్టి కఠినంగా శిక్షిస్తామని చెప్పారు.

అమెరికా రక్షణ సంస్థలపై చైనా ఆంక్షలు

7



కుప్పకూలిపోయిన రైతు

మంత్రికి గోడు వెళ్లబోసుకుంటూ మందడంలో రైతు మృతి

- ఎన్ 8 రోడ్డు నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి- తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని రైతు మంత్రికి తన గోడు వెల్లబుచ్చుకుంటూ కుప్పకూలిపోయారు. దీంతో, రైతుల్లో తీవ్ర విషాదం అలముకుంది. అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం మందడంలోని సిఆర్‌డిఎ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయం వద్ద ఎన్ 8 రోడ్డు నిర్మాణంపై శుక్రవారం మూడోసారి జరిగిన సమావేశంలో మందడం రైతు దొండపాడు రామారావు (70) మాట్లాడుతూ తాను రెండు ఎకరాల భూమిని భూ సమీకరణలో ఇచ్చానని, తనకు ప్రత్యామ్నాయంగా ఇచ్చిన ప్లాట్లు వాగులు వచ్చే ముంపు ప్రాంతంలో కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఇళ్లు తొలగిస్తే తమకు సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన ప్లాట్లు ఇవ్వాలని, అలా కాకుండా ఎక్కడో ముంపు ప్రాంతాల్లో ఇవ్వద్దని కోరారు. ఈ సందర్భంగా తనకు న్యాయం చేయాలని మంత్రి నారాయణను వేడుకున్నారు. అనంతరం సమావేశం నుంచి బయటకు వస్తుండగా రామారావు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆయనను సహచర రైతులు తాడేపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

రైతుల భిన్నాభిప్రాయాలు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం మందడంలో ఎన్ 8 రోడ్డు నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రోడ్డు నిర్మాణ మిగతా 7లో



తిరుపతిలో నిర్మించిన జిల్లా పోలీసు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణ

సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తాం

తిరుపతిలో జిల్లా పోలీసు కార్యాలయం ప్రారంభ సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

రాజకీయ ముసుగులో నేరాలు చేస్తూ చూస్తూ ఊరుకునేది లేదని, రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే సహించేదిలేదన్నారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారినైనా జైలుకు పంపిన చరిత్ర తమదని పేర్కొన్నారు. తిరుపతిలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని హోంమంత్రి వి.అనితతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న విజిటర్స్ బుక్‌లో తన అభిప్రాయాలను, సూచనలను రాశారు. పోలీసు దళం నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుమలకు తరలి వచ్చే యాత్రికులకు పోలీసుల భరోసా ఉండాలన్నారు. తిరుపతిలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు, ఎర్ర చందనం స్మగ్గింగ్ అరికట్టడానికి, పీడీ యాక్టు అమలుకు పోలీసులు చూపుతున్న చొరవను అభినందించారు. టెక్నాలజీని వాడుకుని నేర నియంత్రణ చేయాలని, డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలన్నారు. నేరస్తుల కంటే పోలీసులే ఎక్కువగా ఆలోచించాలని, వారెన్ని డ్రామాలు ఆడినా టెక్నాలజీ సాయంతో పట్టుకోవాలని, ఈ విషయంలో విజిబుల్ పోలీసింగ్, ఇన్విజుబుల్ పోలీస్ అనే విధానాన్ని అనుసరించాలని సూచించారు. వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో పోలీస్ వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తిరుమల యాత్రికులకు ఎక్కడా చిన్న అసౌకర్యం కూడా కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో శాంతిభద్రతలు పూర్తిగా భ్రష్టు పట్టాయని, తిరుమల పవిత్రను దెబ్బతీశారని విమర్శించారు. పోస్టర్లపై జంతురక్తం చల్లి భయభ్రాంతులకు గురిచేయడం ఏ సంస్కృతని ప్రశ్నించారు. ఈ తరహా ఘటనల్లో సిసి కెమెరాలు, డ్రోన్ల ద్వారా ఆధారాలు సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, డిజిపి హరీష్ కుమార్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



అప్పలరాజు తల్లి, భార్యను పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం

అప్పలరాజు వెంటే మేమంతా..

- పార్టీలకు అతీతంగా విశాల మద్దతు
- ధర్మవరంలో పర్యటించిన సిపిఎం బృందం ఎదుట గ్రామస్తులు
- న్యాయం కోసం పోరాడుతాం : వి.శ్రీనివాసరావు

2

విశాఖలో నేటి నుంచి ‘శ్రామిక ఉత్సవ్’

ముఖ్య అతిథిగా సినీ నటుడు ప్రకాష్ రాజ్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా విశాఖ నగరం మరో అద్భుత ఘట్టానికి వేదిక కానుంది. ఈ నెల 27 నుంచి జనవరి 2 వరకూ ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ హాలు వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ‘శ్రామిక ఉత్సవ్’ను ఘనంగా నిర్వహించనున్నట్టు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ప్రారంభించనుండగా, ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఈ ఉత్సవ్‌లో కేవలం సాంస్కృతిక కార్యక్రమాలే కాకుండా ప్రజలను ఆలోచింపజేసే 12 రకాల వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలిపారు. లక్షకుపైగా టైటిళ్లతో ఏర్పాటు చేస్తున్న పుస్తక మహోత్సవాన్ని విద్యాశాఖ అధికారులు ప్రారంభిస్తారని, దేశవ్యాప్తంగా సుమారు 1,500 మంది కళాకారులు పాల్గొంటారని చెప్పారు. కేరళకు చెందిన కథాకళి, మోహిని అట్టం, గుజరాత్‌కు చెందిన గరా నృత్యం వంటి కళారూపాలను ప్రదర్శించనున్నారని తెలిపారు. ఫొటో ఎగ్జిబిషన్, కార్టూన్ ప్రదర్శన, షార్ట్ ఫిలిం వేదిక, సాహిత్య సదస్సులు, మానవ శరీర నిర్మాణం (అనాటమీ)పై అవగాహన కల్పించే స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల్లో చైతన్యం నింపేలా ప్రత్యేక దేశభక్తి గీతాలు, నృత్య రూపకాలు, నాటికల ప్రదర్శనలు ఉంటాయన్నారు. సిఐటియు జాతీయ మహాసభ సారాంశాన్ని సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా వివరించడమే ఈ ‘శ్రామిక ఉత్సవ్’ ప్రధాన ఉద్దేశమని నర్సింగరావు తెలిపారు. శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ కె.రమాప్రభ మాట్లాడుతూ డిసెంబర్ 27 నుండి జనవరి 2 వరకు జరిగే ఈ సాంస్కృతిక వేదికపై ప్రతిరోజూ ఒక ప్రత్యేక థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సెక్యులరిజం, సామాజిక న్యాయం, జెండర్ సమానత్వం, డ్రగ్స్ వ్యతిరేక పోరాటం, కార్మిక - కర్షక ఐక్యత, సమాన పనికి సమాన వేతనం, విద్య - వైద్యం - ఉపాధి హక్కుల వంటి కీలక అంశాలపై చర్చలు, ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఈ ఏడు రోజుల సంబరాల్లో పలువురు ప్రముఖులు భాగస్వాములు కానున్నారని చెప్పారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, కార్టూన్ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, షార్ట్ ఫిలిం వేదికను, సాహిత్య కార్యక్రమాలను పలువురు ప్రముఖులు ప్రారంభించనున్నారన్నారు.

ప్రముఖ గాయకుడు గోరేటి వెంకన్న, డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, నటీనటులు రోహిణి, మాదాల రవి, సత్యారెడ్డి, సినీ దర్శకులు బాబి, రాజమురుగన్, అట్టాడ సృజన్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తదితరులు వివిధ రోజుల్లో అతిథులుగా హాజరవుతారని, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు విశాఖ నగర ప్రజలందరూ ఈ విజ్ఞాన, వినోద ఉత్సవానికి పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉత్సవ్ ఉపాధ్యక్షులు కందారపు మురళి, శ్రామిక ఉత్సవ్ ప్రతినిధులు కె.లక్ష్మయ్య, అనిల్, పి.త్రిమూర్తులు రెడ్డి, ఎల్లాజీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.



శ్రామిక ఉత్సవ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిహెచ్.నర్సింగరావు, అజశర్మ, జగ్గునాయుడు తదితరులు

రోడ్లు రక్తసిక్తం

వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం

ప్రజాశక్తి- ఆళ్లగడ్డ (నంద్యాల జిల్లా), గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని రెండు జిల్లాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు దుర్మరణం చెందారు. పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్‌లోని నిజాంపేటకు చెందిన కొందరు క్యాటరింగ్ పనులు చేస్తున్నారు. ఈ పనిలో భాగంగా బుధవారం తిరుపతికి వచ్చిన వారు హైదరాబాద్‌కు టొయోటా క్వాలిస్ వాహనంలో గురువారం రాత్రి బయల్దేరారు. శుక్రవారం తెల్లవారుజామున ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద వారి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం రోడ్డుకు అటువైపు వెళ్లి ఎదురుగా వస్తున్న సిజిఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న గుండెరావు కులకర్ణి (46), శ్రావణ్ (21), ఇటికాడి నరసింహులు (30), సిద్ధప్ప (50) అక్కడక్కడే మృతి చెందారు. గుండెరావు కులకర్ణి కుమారులు శివ సాయి కులకర్ణి, సిద్ధార్థ కులకర్ణి తీవ్రంగా గాయపడ్డారు. బస్సులోని ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో అంకిరెడ్డిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. వారిలో తెలంగాణలోని సూర్యాపేటకు చెందిన సుశీల (64), వెంకయ్య (70), మహేష్ (28) ఉన్నారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తిరుమల వెళ్లి స్వామి వారికి మొక్కులు తీర్చుకుని తిరిగి సూర్యాపేట వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్, నల్లపాడు సిఐ వంశీధర్ సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



నంద్యాల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు, పక్కన మృతదేహాలు



20 మంది చిన్నారులకు ప్రధానమంత్రి బాల పురస్కారం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందజేత
- అన్నమయ్య జిల్లాకు చెందిన శివానికి దక్కిన గౌరవం

7

రికార్డ్‌స్థాయిలో ఎఫ్‌ఐఐల ఉపసంహరణ

- 2025లో తరలిపోయిన రూ.2 లక్షల కోట్లు

3

సిమ్ బాక్స్, సైబర్ నేరాల్లో అంతర్జాతీయ ముఠా అరెస్టు

- రాష్ట్ర వ్యాప్తంగా రూ.20 కోట్లు నష్టం
- ఇద్దరు విదేశీయులతోపాటు 14 మంది అరెస్టు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిమ్ బాక్స్ ద్వారా విదేశీ కాల్స్‌ను స్వదేశీ కాల్స్‌గా మార్చడంతోపాటు సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ సైబర్ ముఠాను అరెస్టు చేసినట్లు సిఐడి ఎస్‌పి అధిరాజ్ రాణా, డిపార్టుమెంట్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్స్ (డిఒటి) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ హేమంత్ రాత్వే తెలిపారు. మంగళగిరి సిఐడి హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం మీడియా ఎదుట నిందితులను ప్రవేశపెట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మంగళగిరి సిఐడి, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నెంబరు 20/2025గా నమోదైన కేసులో ఇద్దరు విదేశీయులతోపాటు ఇందులో భాగస్వాములైన రాష్ట్రానికి చెందిన 11 మంది, సిమ్ కార్డు అగ్రిగేటర్స్ ఏడుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 14 సిమ్ బాక్సెస్, 22 ఫోన్స్, ఒక ల్యాప్ టాప్, 8 రూటర్స్, 7 కెమెరాలు, 3 యుపిఎస్‌లు, 1 ఇన్వెర్టర్, 1,496 సిమ్‌కార్డులు, మెనిటర్ బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో నిందితులు ఇప్పటి వరకు రాష్ట్రంలో రూ.20 కోట్లు మేర నష్టం కలిగించారన్నారు. ముఠా వెనిజులా, మయన్మార్, కాంబోడియా, థాయిలాండ్, మలేషియా కేంద్రాలుగా నెట్‌వర్క్‌ను విస్తరించారని తెలిపారు. ఇందుకు సంబంధించి విశాఖపట్నం సిటీ పెదగంట్యాడ-గాజువాక ఏరియాలో నమోదైన కేసుతో దర్యాప్తు ప్రారంభించడంతో నేర సామ్రాజ్యం అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. స్థానికులకు ఈ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు వెనిజులాతో పాటు పలు దేశాల నుంచి ట్రైనర్స్ ఇక్కడకు వచ్చి శిక్షణ ఇచ్చి వెళుతున్నట్లు గుర్తించామని, ఇందులో వెనిజులాకు చెందిన హో హ్యూ డ్యూ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. నిందితులు నకిలీ ఆధార్ కార్డులు, నకిలీ పేర్లతో సిమ్ కార్డులు తీసుకుంటారని, ఒక సిమ్ బాక్స్ డివైస్‌లో 64 సిమ్‌లు ఏర్పాటు చేసుకుని నెట్‌వర్క్‌ను విస్తరించారన్నారు. నిందితుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు విశాఖ, హైదరాబాద్, రూర్కెలా (ఒడిశా), నలంద (బీహార్), ఆరంబల్ (గోవా), కోల్‌కతా (వెస్ట్ బెంగాల్)తో పాటు వెనిజులాకు ప్రత్యేక బృందాలను పంపి నిందితులను అరెస్టు చేశామన్నారు. సైబర్ నేరస్తులు పంపే లింక్‌లు టెలిగ్రామ్ ద్వారా పంపుతారని, విదేశీ కాల్స్‌ను స్వదేశీ కాల్స్‌గా రూట్ చేస్తారని, ప్రజలందరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అప్పలరాజు వెంటే మేమంతా..

- పార్టీలకు అతీతంగా విశాల మద్దతు
- ధర్మవరంలో పర్యటించిన సిపిఎం బృందం ఎదుట గ్రామస్తులు
- న్యాయం కోసం పోరాడుతాం : వి.శ్రీనివాసరావు


ధర్మవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉద్యమ నేత అప్పలరాజుకు రాజకీయాలకు అతీతంగా తమ మద్దతు ఉంటుందని ఆయన స్వగ్రామం అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం ధర్మవరం గ్రామస్తులు తెలిపారు. ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగానూ, అక్కడ భూ బాధితులకు అండగానూ ఆయన పోరాడారని, నిర్వాసితుల గళం వినిపించారని అదే గ్రామానికి చెందిన పలువురు పెద్దలు, టిడిపి, వైసిపి నాయకులు చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు సహా పలువురు నాయకులు అప్పలరాజు స్వగ్రామమైన ధర్మవరంలో పర్యటించారు. అప్పలరాజు తల్లి అచ్చమ్మ, భార్య లక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామస్తులతో మాట్లాడారు. సిపిఎం బృందాన్ని అన్ని పార్టీల నాయకులు, ప్రజలు సాదరంగా ఆహ్వానించారు. అప్పలరాజు వ్యక్తిత్వం ఎంత గొప్పదో వివరిస్తూ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులతో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... అప్పలరాజుపై పీడీ చట్టం బనాయించి జైలులో పెట్టడం ప్రజాస్వామిక హక్కులపై దాడేనని, తక్షణం ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో అప్పలరాజు అంతటి ఔన్నత్యం కలిగిన వ్యక్తి లేరని గ్రామస్తులు చెబుతున్నారని, అలాంటి వారిని అసెంబ్లీకి పంపాలన్నారు. జైలులో ఉండాల్సిన కొంతమంది ఎమ్మెల్యేలు, మంత్రులు నేడు అసెంబ్లీలో ఉన్నారని విమర్శించారు. అప్పలరాజును రాజకీయ ఖైదీగా ప్రభుత్వం పరిగణించి అన్ని సౌకర్యాలూ కల్పించాలని డిమాండ్ చేశారు. ఊరూరా గ్రామసభలు పెట్టి... ప్రజాస్వామిక హక్కుల కోసం అప్పలరాజు నిలబడ్డారని ప్రజలు తీర్మానం చేయాలని నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కు ప్రభావిత ఐదు గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్పందిస్తూ 'ఆయన మా కోసం పోరాడారు. ఆయన గొంతుకై మా బాగుకోసం పోరాటాన్ని కొనసాగిస్తాం. ఆయన జైలు నుంచి విడుదలయ్యే వరకూ సిపిఎంతో కలసి పోరాడతాం' అని తెలిపారు. కన్నకొడుకు జైలులో ఉన్నాడని తెలిసినా తల్లి అచ్చమ్మ ముఖంలో ఏడుపు రావడం లేదని, ప్రజలు, రైతుల హక్కుల కోసమే జైలుకెళ్లాడన్న సంతృప్తి ఆమెలోనూ, అప్పలరాజు భార్య లక్ష్మిలోనూ కనిపిస్తోందని వి.శ్రీనివాసరావు అన్నారు. అప్పలరాజు జైలులో ఉన్నా ఉద్యమం ఆగదని, న్యాయం కోసం ఉన్నత న్యాయస్థానాల్లో పోరాడతామని తెలిపారు. పంట భూమిని బలవంతంగా లాక్కొనే హక్కు ఎవ్వరికీ లేదని, రాష్ట్రంలో రెండున్నర లక్షల ఎకరాలను ప్రభుత్వాలు లాక్కొని ఒక్క పరిశ్రమనైనా తెచ్చాయా ? అని ప్రశ్నించారు.

గత ప్రభుత్వంలో చంద్రబాబును 50 రోజుల పాటు జైలులో ఉంచినప్పుడు అతని భార్య, కొడుకు, కోడలు ఆయన కుటుంబమంతా రోజూ కలుసుకునేలాగ అవకాశం ఇచ్చారని, అప్పలరాజు ఏ నేరమూ చేయలేదని, ప్రజల కోసం జైలుకెళ్లిన అప్పలరాజుకు కూడా కుటుంబం, ఆయన ఆప్తులు కలుసుకునేలాగ ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీడీ చట్టాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ చదివి ఉంటే దానిపై సంతకం పెట్టేవారు కాదనిపిస్తోందన్నారు. అయితే ఈ మధ్యనే రాష్ట్ర స్థాయిలో కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు భూ సమస్యలపై పోరాడితే ఈ చట్టాన్ని పెట్టాలని చెప్పడంతో జైలులో పెట్టారన్నది తెలుస్తోందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని సంఘాలనూ, మేధావులనూ కలుపుకొని అప్రజాస్వామిక చర్యలపై సిపిఎం పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.

అనిత మహిళగా తల్లి హృదయం తెరవాలి

హోం శాఖ మంత్రి అనిత తన తల్లి హృదయాన్ని తెరిచి చూస్తే అప్పలరాజు తల్లి పడే ఆవేదన అర్థమవుతుందని శ్రీనివాసరావు అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామ్య హక్కులకు రక్షణలేదంటూ అప్పలరాజుతోపాటు ఉద్యమించిన అనిత... అధికారంలోకి రాగానే సిపిఎం నేతలపై పీడీ చట్టం అమలు చేయడం చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోవడం కాదా ? ప్రశ్నించారు. లోకనాథం మాట్లాడుతూ... పెట్టుబడిదారుల కోసమే అప్పలరాజుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పీడీ చట్టం పెట్టి భూములు కట్టబెట్టే చర్యలకు దిగారన్నారు. ఆయన జైలుకెళ్లినా ఆయన గొంతుకలు గర్జిస్తూనే ఉంటాయన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సిపిఎం, ఎర్రజెండా అండ ఉంటుందన్నారు.


విజ్ఞాన్ సమ్మేళన్ సమావేశంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు, చిత్రంలో మోహన్ భగవత్ తదితరులు

సూపర్ పవర్‌గా భారత్

- 'భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్' సదస్సులో చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

త్వరలోనే భారతదేశం సూపర్ పవర్ కావడం ఖాయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. భారతదేశంలో అద్భుతమైన కుటుంబ వ్యవస్థ ఉందని, అందరికీ భద్రత కల్పించేలా మన కుటుంబ వ్యవస్థ ఉందని వివరించారు. ఇదే సమయంలో దేశాన్ని ప్రపంచ దేశాల ముందు ప్రత్యేకంగా నిలబట్టేంది మన విలువలు, సంప్రదాయాలేనని అన్నారు. మన పురాణ పురుషుల గొప్పదనాన్ని యువతకు తెలియచెప్పాలన్నారు. 'సమగ్ర వికాసానికి భారతీయ చింతన' అనే భావంతో డిసెంబర్ 26 నుంచి 29 వరకూ నాలుగు రోజుల పాటు దేశంలోని 32 రాష్ట్రాల నుంచి, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన 1250 మంది ప్రతినిధులతో తిరుపతిలోని సంస్కృత విశ్వ విద్యాలయంలో 'భారతీయ విజ్ఞాన సమ్మేళనం' నిర్వహించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో కలిసి సందర్శించారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన వివిధ యుద్ధ పరికరాల నమూనాలను సిఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి చంద్రబాబు మాట్లాడారు. మన దేశం, భారతీయత గురించి చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ మంచి వేదిక అన్నారు. 2047 నాటికి భారత దేశం ప్రపంచంలో నెంబర్-1 స్థానంలో నిలుస్తుందన్నారు. మన జనాభానే మనకు ఆస్తిగా మారిందన్నారు. పేద, ధనిక మధ్య అంతరాలు తగ్గే వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మోహన్ భగవత్ మాట్లాడుతూ... ప్రతి వ్యక్తి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం పొంది జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం భారతీయ జ్ఞాన పరంపర-ఐకెఎస్ ద్వారా భారతదేశంలోని 2000 సంవత్సరానికి పూర్వం మన ఋషులు రచించిన అత్యంత నిగూఢమైన శాస్త్ర సాంకేతిక విషయాలను వెలికి తీస్తూ భావిభారతానికి అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రొఫెసర్ భారత్, డాక్టర్ సతీష్ రెడ్డి, సంస్కృత విద్యాపీఠం కులపతి జిఎస్ఆర్కే శాస్త్రి పాల్గొన్నారు.



రిక్షాలో మృతదేహం తరలింపు

- గుమ్మలక్ష్మీపురంలో విషాదకర సంఘటన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీ పురంలో శుక్రవారం విషాదకర సంఘటన చోటు చేసుకుంది. మృతదేహాన్ని తరలించేందుకు డబ్బుల్లేక రిక్షాలో తరలించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి చెందిన నిమ్మక రాధమ్మ (60) అనారోగ్యంతో భద్రగిరి ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందారు. అక్కడ అంబులెన్సు సదుపాయం లేకపోవడంతో ప్రైవేటు వాహనంలో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లాలని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ప్రైవేటు వాహనానికి డబ్బులు చెల్లించే స్థోమత లేకపోవడంతో భద్రగిరి ఆస్పత్రి నుంచి రాధమ్మ మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులు రిక్షాలో ఇంటికి తరలించారు.

తక్షణమే కేసు ఉపసంహరించుకోవాలి

- మేధావులు, అభ్యుదయ వాదులు, పౌరసంఘాలు, రచయితల విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అనకాపల్లి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై అక్రమంగా పెట్టిన పిడి చట్టం ఉపసంహరించుకోవాలని, తక్షణమే ఆయనను విడుదల చేయాలని మేధావులు, అభ్యుదయ వాధులు, పౌర సంఘాలు, రచయితలు రిటైర్డ్ ఐఎఎస్, రిటైర్డ్ అధికారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం మేధావులు, అభ్యుదయవాదులు, పౌరసంఘాలు, రచయితలు ఒక ప్రకటన విడుదల చేశారు. అప్పలరాజు అరెస్ట్‌కు ఇచ్చిన ఆర్డర్‌లో 2013 నుంచి డిసెంబరు 10 వరకు మొత్తం 19 కేసుల్లో నిందితునిగా పేర్కొనగా అందులో రెండు కేసుల్లో నిర్దోషిగా తేల్చగా, 12 కేసులు మూసివేశారన్నారు, మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయన్నారు. కేసుల్లో అత్యధిక భాగం 151 సెక్షన్ల కేసులే ఉన్నాయన్నారు. భూములు కోల్పోతున్న పేద రైతులు అందునా అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల కోసం, వృత్తిదార్ల ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్న ప్రజలను భయభ్రాంతులను చేసేందుకే అప్పలరాజుపై దుర్బుద్ధితో అక్రమంగా పిడి చట్టం కేసు నమోదు చేశారని స్పష్టమవుతోందన్నారు. ఫార్మా లాబీ, కార్పొరేట్లు కొమ్ముకాసే వారిని సంతృప్తిపరచడానికి ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడటం గర్హనీయమన్నారు. కార్పొరేట్ల లాభాల కోసం సముద్ర తీరాన్ని పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టి, రాజ్యాంగం, చట్టప్రకారం ప్రభుత్వం వ్యవహరించాలని వారు సూచించారు. ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భూ సేకరణకు అడ్డుపడేవారిపై పిడి యాక్ట్ ప్రయోగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, అందుకు అనుగుణంగానే కలెక్టర్ కనీసం ఇప్పటి వరకు ఉన్న కేసుల స్వభావం పరిశీలించకుండానే సంతకం పెట్టి ఆర్డర్ జారీ చేయడం అసమంజసమన్నారు. 2022లోనూ గత ప్రభుత్వం ఇలాంటి కేసులు పెట్టడాన్ని తొందరపాటు చర్యగా హైకోర్టు పేర్కొందన్నారు.

అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టడాన్ని నిరశించిన వారిలో వడ్డే శోభనాద్రీశ్వరరావు (మాజీ మంత్రి, ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనరు), ఇఎఎస్ శర్మ (కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి), గోపిమూర్తి (ఎమ్మెల్సీ), చలసాని శ్రీనివాసరావు (రాష్ట్ర ప్రత్యేక హోదా సాధనా సమితి సభ్యులు), సామ్యూల్ ఆనంద్‌కుమార్ (రిటైర్డ్ ఐఎఎస్), సుంకర రాజేంద్రప్రసాద్ (ఆలిండియా ఐలు వర్కింగ్ ప్రెసిడెంట్), ప్రొఫెసరు కె.నాగేశ్వర్ (మాజీ ఎమ్మెల్సీ), వి.లక్ష్మణరెడ్డి (జనచైతన్య వేదిక అధ్యక్షుడు), వి.రాజేంద్రప్రసాద్ (రిటైర్డ్ మున్సిపల్ రీజినల్ డైరెక్టర్, ఏలూరు) టి.విజయ్‌కుమార్ (రిటైర్డ్ సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్), జి.గుర్రప్ప (రిటైర్డ్ జడ్జి, తిరుపతి), తెలకపల్లి రవి (ప్రముఖ సాహితీవేత్త, విశ్లేషకులు), అయితాబత్తుల రామేశ్వరరావు (సామాజిక న్యాయ సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షులు), కెఎస్ లక్ష్మణరావు (మాజీ ఎమ్మెల్సీ), వి.బాలసుబ్రహ్మణ్యం (మాజీ ఎమ్మెల్సీ, నెల్లూరు), ఐ.వెంకటేశ్వరరావు (మాజీ ఎమ్మెల్సీ, అమలాపురం), ప్రొఫెసరు ఎన్ వేణుగోపాలరావు (రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త) రవి గువెరా (సీనియర్ అడ్వకేట్, ఎపి బార్ కౌన్సిల్ మెంబరు, కర్నూలు), బి.చంద్రుడు (సీనియర్ అడ్వకేట్, కర్నూలు బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి), కొరివి వినయ్‌కుమార్ (దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు), బి.శంకరయ్య (సీనియర్ అడ్వకేట్, నంద్యాల), సుల్తానా మియా (న్యాయవాది, కర్నూలు), వై.జయరాజ్ (హైకోర్టు న్యాయవాది, కర్నూలు), కె.బలరాం (అడ్వకేట్, ప్రజాపరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, కర్నూలు), కె.కుమార్ (అఖిల భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు), నల్లి ధర్మారావు (అభ్యుదయకవి, శ్రీకాకుళం), ప్రొఫెసరు సి.రామచంద్రయ్య (రిటైర్డ్ అధ్యాపకులు, సోషియల్ సైంటిస్ట్), ఎంవిఎస్ శర్మ (మాజీ ఎమ్మెల్సీ, విశాఖ), పి.సురేష్‌కుమార్ (సుప్రీంకోర్టు న్యాయవాది), డి.పాపారావు (రాజకీయ ఆర్థిక విశ్లేషకులు) ఉన్నారు.

సిఐటియు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు జెల్లి నాగేశ్వరరావు మృతి

- పలువురు సంతాపం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్/అమరావతి బ్యూరో


జెల్లి నాగేశ్వరరావు (ఫైల్ ఫోటో)

సిఐటియు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు జెల్లి నాగేశ్వరరావు (55) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ వారం రోజుల క్రితం ప్రభుత్వ వైద్యశాలలో చేరిన ఆయన శుక్రవారం ఉదయం కన్నుమూశారు. ఆయనకు భార్య శివలక్ష్మి, కూతుర్లు వీణ, లీల ఉన్నారు. ఆయన నంద్యాల జిల్లా పాములపాడు మండలం లింగాల గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో హుస్సేనమ్మ, చిన్న అంబన్న దంపతులకు 1970 జులై 3న జన్మించారు. విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐలో పనిచేస్తూ సిపిఎంకు ఆకర్షితుడయ్యారు. 1995 నుంచి పూర్తికాలపు కార్యకర్తగా చేరి వివిధ బాధ్యతల్లో తుదిశ్వాస వరకు 40 సంవత్సరాల పాటు పనిచేశారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, సాహితీ స్రవంతి నాయకులు కె.మోహన్, జంధ్యాల రఘుబాబు, ఐద్వా రాష్ట్ర నాయకులు ఎన్.అలివేలు, పలు సంఘాల నాయకులు సందర్శించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలు నంద్యాల జిల్లా పాములపాడు మండలం లింగాలలో నిర్వహించారు.

సిఐటియు, ప్రజాసంఘాల సంతాపం

సిఐటియు కర్నూలు జిల్లా కమిటీ ఆఫీస్ బేరర్ జె నాగేశ్వరరావు మృతి పట్ల సిఐటియు రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాగేశ్వరరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కూడా సంతాపం తెలిపింది. వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన నాగేశ్వరరావు మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు కూడా నాగేశ్వరరావు మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

ఉద్యమనేతపై పీడీయాక్ట్ అప్రజాస్వామికం

- అప్పలరాజును బేషరతుగా విడుదల చేయండి
- సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు



విజయవాడలో ఇనుప తీగతో చేతులకు సంకెళ్లు వేసుకొని వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉద్యమ నేత అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పీడీ యాక్ట్‌ను రద్దు చేసి, బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. విజయవాడ బీసెంట్ రోడ్డులోని అన్సారీ పార్కు సెంటర్‌లో ధర్నా చేశారు. భూ కబ్జాదారులు, రౌడీలు, మాఫీయాలపై మోపే పీడీ యాక్ట్‌ను ప్రజానేత, ప్రజా ఉద్యమ నాయకులు అప్పలరాజుపై మోపడం సిగ్గు...సిగ్గు, ఉద్యమకారులపై ప్రభుత్వ దమనకాండ నశించాలని నినాదాలు చేశారు. ఇనుప తీగతో చేతులకు సంకెళ్లు వేసుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు చిగురుపాటి బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ...ప్రజానాయకుడు, ప్రజల తరపున నిరంతరం పోరాడే అప్పలరాజుపై అప్రజాస్వామిక, నిరంకుశ వైఖరితో పీడీ యాక్ట్‌ను మోపడం తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. అప్పలరాజును విడుదల చేయకపోతే వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికపార్టీలతో పాటు ప్రజలను ఐక్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అంద్ర మాల్యాద్రి, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి ఆంజనేయులు, కోటా కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శ్యామల సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం వద్ద, పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం గడ సింగపురంలో నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మార్కెట్ యార్డు వద్ద ఆందోళన చేపట్టారు. వీరవాసరం మండలం నవుడూరు సెంటర్‌లో, భీమవరం మండలం వెంప బస్టాండ్ సెంటర్‌లో, పెనుమంట్ర మండలం మార్టేరు సెంటర్‌లో, ఆకివీడులోని గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసనలు చేపట్టారు. తాడేపల్లిగూడెం మండలం ఇటుకులకుంట గ్రామంలో ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

అనకాపల్లిలో అఖిలపక్ష పార్టీలు, కార్మిక ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అప్పరాజును బేషరతుగా విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి పార్టీలతో పాటు రైతు కూలీ సంఘం, మహిళా సమాఖ్య, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, వార్వా, సిఐటియు తదతర సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. పరవాడ మండలం దేశపాత్రునిపాలెంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

అప్పలరాజును వెంటనే విడుదల చేయాలి ఎపి కౌలు రైతు సంఘం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం అప్పలరాజును పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి జైలుకు తరలించడాన్ని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకించింది. అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్టు కేసులు ఉపసంహరించుకుని, జైలు నుంచి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


రోడ్డుపై నీళ్లు చల్లి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కన్నాయిగూడెం - పొంగుటూరు రోడ్డు నిర్మించాలి

- గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలంలో కన్నాయిగూడెం గ్రామానికి వెళ్లే పొంగుటూరు - కన్నాయిగూడెం రహదారిని తక్షణం నిర్మించాలని కోరుతూ కన్నాయిగూడెం గ్రామస్తులు శుక్రవారం వినాయకగుడి సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. అధ్వాన రహదారి వల్ల రేగుతున్న దుమ్ము ఇళ్లపై పేరుకుపోతోందని రోడ్డుపై నీళ్లు చల్లి నిరసన తెలిపారు. పొంగుటూరు నుంచి కన్నాయిగూడెం వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర రహదారి ఏడు సంవత్సరాలుగా గోతులు పడి అధ్వానంగా తయారైనా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వంటి సేవలు కూడా గ్రామానికి చేరుకోని పరిస్థితి నెలకొందని వాపోయారు. అదే సమయంలో మూడేళ్లుగా కన్నాయిగూడెం గ్రామ శివార్లలో పొంగుటూరు గ్రామానికి ఆనుకుని గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణ పనులు సాగుతున్నాయని, దీనికి సంబంధించిన మెటీరియల్ తరలింపునకు ఈ రోడ్డుపైనే భారీ వాహనాల రాకపోకలు సాగించడంతో తాము రహదారిపై ప్రయాణించలేని విధంగా దెబ్బతిందని తెలిపారు. భారీ వాహనాల రాకపోకల వల్ల ఊరంతా దుమ్ముతో నిండిపోయి, అనేక మందికి శ్వాసకోశ, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు తలెత్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై స్పందించి రహదారి నిర్మించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తోట రామకృష్ణ, తోట వెంకటేశ్వరరావు, మన్నిడి వెంకన్న, మద్దుకూరి శ్రీను, మద్దుకూరి ప్రసాద్, యు.దానయ్య, జమ్ముల లక్ష్మీపతి, మద్దిపాటి సత్యనారాయణ, రమణ, టి.లక్ష్మీ, టి.నాగమణి, ఎం.రాజీవకృష్ణ, ఉరింకల నాగు, ఎం.సత్తిరాజు, ఎస్.శ్రీను పాల్గొన్నారు.

గర్భిణులకు చిరునవ్వుతో సూచనలు : వీరపాండియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించే చర్యల్లో భాగంగా కిల్కారి (చిన్నారి చిరునవ్వు) కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలకు సలహాలు, సూచనలు ఐవిఆర్ఎస్ ద్వారా ఇస్తున్నామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు జి వీరపాండియన్ వెల్లడించారు. ఏటా ఐవిఆర్ఎస్ ద్వారా సగటున 2.5 లక్షల మందికి వాయిస్ కాల్స్ ద్వారా తల్లి, బిడ్డల ఆరోగ్య సంరక్షణ, పోషణ, టీకాల ప్రాముఖ్యత, కుటుంబ నియంత్రణ, ఇతర అంశాలపై కనీసం నాలుగు నిమిషాలపాటు వివరిస్తున్నామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫోన్ నెంబర్లను కేంద్రం మార్చిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న 0124451660 నెంబరు స్థానంలో 1600403660 నెంబర్‌ను మార్చినట్లు తెలిపారు.

అధికారంతో సంబంధం లేకుండా పేదవాడి పక్షాన నిలిచిన ఎర్రజెండా

- సిపిఐ శతాబ్ది వేడుకల్లో జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - విజయవాడ



శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

గత వందేళ్ల చరిత్రలో అధికారం ఉన్నా లేకున్నా పేదవాడి పక్షాన ఎర్రజెండా నిలిందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సిపిఐ శతాబ్ది ముగింపు వేడుకలు శుక్రవారం విజయవాడలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విజయవాడ జింఖానా గ్రౌండ్ నుండి లెనిన్ సెంటర్ వరకు 150 అడుగులు ఎర్రజెండా చేతపట్టుకుని కొమ్ము డ్యాన్స్, తీన్మార్, డప్పు వాయిద్యాలు, థింసా, కోలాట కార్యక్రమాలతో భారీ ప్రదర్శన సాగింది. అనంతరం లెనిన్ విగ్రహం ప్రాంగణం వద్ద పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో వివిధ కారణాలతో కమ్యూనిస్టులు విడిపోయారని, దేశ ప్రయోజనాల కోసం, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు అంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.

దేశంలో అరాచకం రాజ్యమేలుతోందని, రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరత ప్రతిపౌరుడుపై ఉందన్నారు. బ్రిటీషు సామ్రాజ్యవాదుల నియంతత్వ పాలనలో పార్టీపై అనేక కుట్రలు జరిగాయని, అయినా వెనకడుగు వేయకుండా పోరాడి నిలిచిందని పేర్కొన్నారు. ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు ప్రజా పోరాటంలో అమరులయ్యారని చెప్పారు. 12 సంవత్సరాల మోదీ పాలనలో చేసేందేమీ లేదని, కేవలం మతం ముసుగులో రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. దేశ సంపదను అమ్మే పనిలో మోదీ పాలన ఉందన్నారు. పేదరికం నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఓవైపు క్రిస్మస్ వేడుకల్లో మోదీ పాల్గొనగా... మరోవైపు క్రైస్తవులపై దాడులు పథకం ప్రకారం జరుగుతున్నాయని మండిపడ్డారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ దోపిడీదారుల చేతుల్లో రాజ్యాధికారం ఉందని, స్వార్థ ప్రయోజనాలు కోసం దళితులు, గిరిజనులను చంపేసి సంపదను దోచుకునే పనిలో మోదీ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఎర్రజెండా నూతన శక్తిని కూడగట్టుకుని ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న పాలకులపై పోరాడటానికి సిద్ధమవుతున్నామని స్పష్టం చేశారు. దేశం బాగుపడాలంటే ఎర్రజెండా దెపరెపలాడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ బల్లి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అన్‌ఫిట్ అయిన ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు

- జిఓ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోర్టు తీర్పులు, పెండింగ్ కేసుల నేపథ్యంలో ప్రభుత్వం మెడికల్ అన్‌ఫిట్ అయిన ఎపిఎస్‌ఆర్‌టిసి (ఎపిపిటిడి) ఉద్యోగులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలివ్వాలని నిర్ణయించింది. 2020 జనవరి ఒకటి తర్వాత మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు ఈ అవకాశం లభించనుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం జిఓ ఎంఎస్ నెంబరు 58ని శుక్రవారం విడుదల చేసింది. అర్హులైన వారికి ప్రాధాన్యతా క్రమంలో జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వనున్నారు. అక్కడ కూడా అర్హత లేనట్లయితే ఆర్‌టిసి విలీనానికి ముందు ఉన్న విధంగా సంబంధిత ఉద్యోగికి వారికున్న అర్హత ప్రకారం అడిషనల్ మోనిటరీ బెనిఫిట్ నోషనల్‌గా పిఎఫ్, నోషనల్ గ్రాట్యూటీ చెల్లించే విధంగా జీఓలో పొందుపరిచారు. ఈ అంశానికి సంబంధించి మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు జిఓ ప్రకారంఉన్న కొన్ని వ్యాధులకు మాత్రమే కాకుండా అన్ని రకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారందరికీ ప్రత్యామ్నాయ ఉద్యోగం కల్పించాలని అడిషనల్ మానిటరింగ్ బెనిఫిట్ చెల్లించాలని లేని పక్షంలో 18 రకాల వ్యాధులతో అనారోగ్యం పాలైన ఉద్యోగి,కార్మికులకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని గత ఐదేళ్లుగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ పోరాడుతోంది. ఇందుకు సంబంధించి ఆర్‌టిసి యాజమాన్యానికి ఫెడరేషన్ పలు దఫాలుగా లేఖలు రాయడంతో పాటు హైకోర్టులో కేసు కూడా వేశారు. ఈ నేపథ్యంలో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు, ఆర్‌టిసి ఎమ్‌డిలకు ఎస్‌డబ్ల్యుఎఫ్, ఎపి పిటిడి ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ లు హర్షం వ్యక్తం చేశాయి.

శభాష్ వాసు




వాసు తన తండ్రితో కలిసి రామాపురం పల్లె నుండి పట్నం స్కూల్లో జాయిన్ అవ్వడానికి బయలుదేరాడు. బస్సు చాలా రష్‌గా ఉంది. నాన్నకి వెనుక సీటు దొరికింది. వాసు కండక్టర్ పక్కన కూర్చున్నాడు. కొంత దూరం వెళ్ళాక ఓ పెద్దాయన బస్సు ఎక్కాడు. ఆయన వాసు పక్కన నిలుచున్నారు. కొంతసేపటి తరువాత వాసు లేచి ఆయన్ని తన సీటులో కూర్చోమన్నాడు. 'పరవాలేదు బాబూ, నువ్వు చిన్నవాడివి. నువ్వే కూర్చో' అన్నారాయన. 'పరవాలేదు సార్, నాకు నిలబడి వెళ్లడం అలవాటే' అంటూ ఆయనకి సీటు ఇచ్చాడు వాసు.

పట్నం చేరాక వాసు, నాన్నతో కలిసి స్కూల్‌కి వెళ్ళాడు. అక్కడ గుమస్తా, 'మీరు చాలా ఆలస్యంగా వచ్చారు. సీట్లు అన్నీ అయిపోయాయి. ఖాళీలు లేవు' అని చెప్పాడు. అప్పుడు 'మా అబ్బాయి, బాగా చదువుతాడు సార్. ఎలాగైనా సీటు ఇవ్వండి' అని వాసు వాళ్ల నాన్న ఎంతో ప్రాధేయపడ్డాడు. అయితే 'ఒకసారి ప్రిన్సిపాల్ గారిని కలవండి' అని చెప్పి గుమస్తా అక్కడి నుండి వెళ్లిపోయాడు. ప్రిన్సిపాల్‌ని కలవడానికి వాసు, వాసు వాళ్ల నాన్న లోపలికి వెళ్ళారు.

ప్రిన్సిపాల్‌ని చూస్తూనే 'సార్... మీరా' అన్నాడు వాసు. బస్సులో వాసు సీటు ఇచ్చింది ఈయనకే. ఆ విషయం నాన్న చెవిలో మెల్లిగా చెప్పాడు వాసు. వాసుని చూస్తూనే 'ఏం బాబూ... ఇంత దూరం వచ్చి ఈ స్కూల్లో చేరుతున్నారు?' అని అడిగారు ప్రిన్సిపాల్. 'నాన్న దగ్గర డబ్బులు లేవు సార్. మా ఊళ్లో పెద్ద క్లాసులు చదువుకునేందుకు పెద్ద బడి లేదు. అందుకే ఇంత దూరం వచ్చాను. ఇక్కడేమో సీట్లు లేవని చెబుతున్నారు' అన్నాడు వాసు. 'నువ్వు నాకు బస్సులో సీటు ఇచ్చావు. నీకు నేను ఈ స్కూల్లో సీటు ఇస్తున్నాను. అంతేకాదు, ఇక్కడ హాస్టల్లో కూడా సీటు ఇప్పిస్తాను. ఇక్కడే ఉండి చక్కగా చదువుకో' అని ప్రిన్సిపాల్ అనగానే, వాసు, వాళ్ల నాన్న ఎంతో సంతోషించారు. వాసు బాగా చదువుకుని ఊరివాళ్లతో 'శభాష్ వాసు' అనిపించుకున్నాడు.

- కూచిమంచి నాగేంద్ర
91821 27880.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరసగా కలుపుతూ వెళ్లండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ



పి.ప్రసన్న,
5వ తరగతి,
ఎం.పి.యు.పి.స్కూలు,
పి.నైనవరం,
ఎన్టీఆర్ జిల్లా.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పరిశుభ్రత, సమతుల ఆహారమే కీలకం

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) నివేదిక ప్రకారం అంటువ్యాధుల కారణంగా 71 శాతం మంది మృత్యువాత పడుతున్నారు. మనదేశంలో 63 శాతం మంది చనిపోతున్నారు. అంటువ్యాధుల కారకాలను ముందస్తుగా గుర్తించటం, వ్యాధుల ముప్పను ముందుగానే అంచనా వేయటం, విస్తృత వేగంతో వాటిని ఎదుర్కొనే చర్యలపై పలు ప్రపంచవ్యాప్త ఆరోగ్య సంస్థలు పరిశోధనలు కొనసాగిస్తూనే ఉన్నాయి.

నేడు అంతర్జాతీయ అంటువ్యాధుల సంసిద్ధత దినోత్సవం



మన శరీరంలో అంతర్లీనంగా అద్భుతమైన రోగనిరోధక వ్యవస్థ ఉంటుంది. సూక్ష్మజీవులు, వ్యాధికారకాల నుంచి ఆరోగ్యాన్ని నిరంతరం కాపాడే కవచమిదే. కణాలు, వివిధ అవయవాలు, ప్రతిరక్షకాలతో కూడిన ఈ వ్యవస్థ శరీరంలోకి ప్రవేశించే హానికరమైన వాటిని గుర్తించి ఎదుర్కొంటుంది. శరీర కణజాలం నుంచి అనవసరమైన పదార్థాలను వేరుచేసి వ్యాధుల నుంచి రక్షిస్తుంది. పుట్టుకతో వచ్చే రోగనిరోధక వ్యవస్థకు తోడు మనిషి పెరిగేకొద్దీ నిర్దిష్ట వ్యాధి కారకాలను ఎదుర్కోవడానికి టీకాలు అవసరమవుతాయి. సకాలంలో వీటిని తీసుకోకపోతే పలు అంటురోగాలు, ప్రాణాంతక వ్యాధులు, జన్యుపరమైన రుగ్మతలు వంటివి ఉద్ధృతమవుతుంటాయి.

కరోనా పరిణామాల తర్వాత ఏటేటా ప్రపంచవ్యాప్తంగా వివిధ అంటువ్యాధులు (ఇన్ఫెక్షన్ డిసీజెస్) ప్రబలుతూ ప్రజలను భయానికి గురి చేస్తున్నాయి. పలు రకాల వైరస్‌లు విస్తరిస్తూ భయోత్పాతానికి గురిచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) కొత్త వైరస్‌ల తాలూకా వివరాలను వెల్లడిస్తూ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయమై కూడా హెచ్చరికలు సైతం జారీచేస్తోంది. ప్రపంచంలోని పలు సంస్థల నుంచి వచ్చిన పరిశోధనా ఫలితాలు, నియంత్రణకు తీసుకోవాల్సిన కృషి గురించి వివరిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పలు రకాల వైరస్‌లు విజృంభిస్తుండగా, మిలియన్ల వైరస్‌లు మామూలుగానే ఉన్నట్లుగా సమాచారం. జంతువులు, పక్షులకు వ్యాపించే ఇలాంటి వైరస్‌లు ఎప్పుడైనా మానవాళిపై ప్రభావాన్ని చూపించొచ్చు. ఇప్పటికే ఎబోలా, జికా వైరస్, డింగా డింగా జబ్బు, స్క్రబ్‌టైఫస్ వంటివి ఇప్పటికే ఉన్నాయి.

అంటువ్యాధులు - అప్రమత్తం

ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అంటువ్యాధుల్లో సూక్ష్మక్రిములు (బ్యాక్టీరియా), వైరస్, ఫంగస్, పరాన్న జీవికి సంబంధించినవి. అంటువ్యాధి కాకుండా మిగిలిన జబ్బులైన వాటిలో జీవన శైలికి సంబంధించినవి షుగర్, గుండె జబ్బులు, బిపి వంటివి. మానసిక వ్యాధుల్లో డిప్రెషన్, యాంగ్జైటీ, వాతావరణంతో వచ్చే జబ్బుల్లో ఫుడ్ పాయిజన్, కలుషిత నీటి వ్యాధులు, ఆహార లోపంతో వచ్చే జబ్బులు (న్యూట్రిషనల్ డిసీజెస్)లో ఊబకాయం, విటమిన్ లోపంతో వచ్చేవి ఉన్నాయి. వీటిలో ఎక్కువ మానవ నిర్లక్ష్యంతో వచ్చేవే ఎక్కువ. ముందస్తుగా జీవనశైలికి సంబంధించిన మార్పులు, జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా కొన్ని ఎపిడమిక్స్ (అంటువ్యాధులు) నుంచి బయటపడొచ్చు. ఎండమిక్స్ (ప్రదేశం వాతావరణం), పాండమిక్ (మహమ్మారి)గా చెప్పుకునే వ్యాధులతో జాగ్రత్తలు తీసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు సమన్వయంతో అంటువ్యాధులకు సంబంధించిన పరిశోధనల్లో టీకాలు, చికిత్సకు కావాల్సిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నాయి. ప్రతిఒక్కరూ తమ వంతుగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మేలు.

కంగారుపడొద్దు

ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండుసార్లు ఐదు రకాల రక్త పరీక్షలు చేయించుకోవటం మేలు.

కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సిబిసి) పరీక్ష : రక్తంలో ఎర్ర రక్త కణాలు, తెల్ల రక్త కణాలు, ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలుసుకోవడానికి సిబిసి పరీక్ష దోహదపడుతుంది. ఆరోగ్యం, రక్తహీనత, అంటువ్యాధులు, రక్తం గడ్డకట్టడానికి సంబంధించిన రుగ్మతల నిర్ధారణ గురించి అవసరమైన విషయాలు తెలుస్తాయి. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని తెలుసుకోవచ్చు.



లిపిడ్ ప్రొఫైల్ : ఈ పరీక్షను అందరూ చేయించుకోవటం మంచిది. కొలెస్ట్రాల్ స్థాయిలు, గుండె ఆరోగ్యానికి సంబంధించిన ఇతర లిపిడ్ మార్కర్లను అంచనా వేయొచ్చు. గుండె సంబంధిత సమస్యల తీవ్రతను అంచనా వేయొచ్చు.

గ్లూకోజ్ పరీక్ష : రక్తంలో చక్కెర స్థాయిలను అంచనా వేయడానికి, మధుమేహం లేదా ప్రీడయాబెటిస్‌ను గుర్తించడంలో ఈ పరీక్ష సహాయపడుతుంది. ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ (ఎఫ్‌బిఎస్). ఇందుకోసం ఖాళీ కడుపుతో ఉన్న సమయంలో పరీక్ష కోసం రక్తం తీసుకుంటారు. ఈ పరీక్ష ద్వారా శరీరానికి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించే స్థాయిని తెలుసుకోవచ్చు. కంట్రోల్ చేసే కెపాసిటీని తెలుసుకోవచ్చు.

హిమోగ్లోబిన్ ఏ1సి : ఈ పరీక్ష ద్వారా రెండు నుంచి మూడు నెలల్లో రక్తంలో చక్కెర స్థాయిలను తెలుసుకోవచ్చు. ఒకవేళ మధుమేహం లేదా ప్రీ డయాబెటిస్ గుర్తించొచ్చు. సరైన చికిత్స తీసుకోవడం వల్ల గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు, నరాలు దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

చికిత్సలే మేలు

ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలొచ్చినా నిర్లక్ష్యం చేయకుండా సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదించటం మేలు. త్వరితగతిన వ్యాధి నిర్ధారణ చేసుకుని చికిత్స పొందడం ద్వారా వ్యాధి త్వరగా నయం చేసుకోవచ్చు. వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. చలివాతావరణంలో చికున్ గున్యా, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, మెదడువాపు, కలరా మొదలగు వ్యాధులు వస్తాయి. దగ్గు, జ్వరం, నొప్పులు, వాంతులు, విరోచనాలు లక్షణాలు ఉన్నప్పుడు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి.



- డాక్టర్ బి.భాను నాయక్
అదనపు జిల్లా వైద్యాధికారి,
ఎన్‌టిఆర్ జిల్లా.

రంగవల్లులకు స్వాగతం!

సంక్రాంతి పండుగ హడావిడిలో ముగ్గులది ప్రత్యేక స్థానం. మరి ఇంకెందుకు ఆలస్యం? చకచకా ముగ్గులు వేసేయండి. 'జీవన' పాఠకులతో పంచుకోండి. తెల్ల కాగితంపై పెన్సిల్ లేదా బాల్‌పాయింట్ పెన్నుతో వేసిన ముగ్గులకు రంగులు నింపి పంపండి. అందరికీ అర్థమయ్యేలా నిలువు, అడ్డం చుక్కల వివరాలు కూడా పేర్కొనండి. మీ పేరు, చిరునామా, ఫొటో, ఫోన్ నెంబరు కచ్చితంగా పంపాలి. మెయిల్ ద్వారా పంపేవారు పూర్తి చిరునామా పంపాలి.

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక,
ప్రజాశక్తి భవనం,
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com,
వాట్సాప్ : 83329 25496

రికార్డ్‌స్థాయిలో ఎఫ్ఐఐల ఉపసంహరణ

- **2025లో తరలిపోయిన రూ.2 లక్షల కోట్లు**

న్యూఢిల్లీ : భారత స్టాక్ మార్కెట్లపై విదేశీ సంస్థాగత మదుపర్లు మొఖం చాటేస్తోన్నారు. ఈ ఏడాది 2025లో కేవలం ఆరు కీలక రంగాల నుంచే విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) దాదాపు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇది భారత మార్కెట్ చరిత్రలో అత్యంత దారుణ స్థితుల్లో ఒక్కటి. 2025 ముగిసే సమయానికి ఈ అమ్మకాల నష్టం మరింత పెరగొచ్చని ట్రేడర్లలో ఆందోళన నెలకొంది. ఎన్ఎస్‌డిఎల్ సమాచారం మేరకు.. ప్రధానంగా ఆరు రంగాలపై ఎఫ్ఐఐల ప్రభావం తీవ్రంగా చూపింది. ఐటి, ఎఫ్ఎంసిజి రంగాల నుంచి అత్యధికంగా విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

రంగం	తరలిపోయిన ఎఫ్ఐఐలు
ఐటి	రూ.79,155 కోట్లు
ఎఫ్ఎంసిజి	రూ.32,361 కోట్లు
విద్యుత్	రూ.25,887 కోట్లు
హెల్త్‌కేర్	రూ.24,324 కోట్లు
కన్స్యూమర్ డ్యూరెబుల్స్	రూ.21,567 కోట్లు
కన్స్యూమర్ సర్వీసెస్	రూ.19,914 కోట్లు

మొత్తంగా 2025లో ఇప్పటివరకు భారత ఈక్విటీల నుండి రూ.1.6 లక్షల కోట్ల ఎఫ్ఐఐలు తరలిపోయాయి. "2025 క్యాలెండర్ ఇయర్‌లో ఎఫ్ఐఐలు 17.8 బిలియన్ డాలర్ల (రూ.1.6 లక్షల కోట్లు) విలువైన భారతీయ షేర్లను విక్రయించారు. ఈ నిధులు చైనా, జపాన్, యూరప్, అమెరికా వంటి ఇతర గ్లోబల్ మార్కెట్లకు తరలిపోయాయి" అని ఐసిఐసిఐ సెక్యూరిటీస్ తెలిపింది. భారత మార్కెట్లు స్వల్ప లాభాలను మాత్రమే ఇవ్వగా.. ఇదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లు 12-61 శాతం మధ్య లాభాలను అందించాయి.

రియల్టీ (రూ. 12,364 కోట్లు), ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ. 10,894 కోట్లు), ఆటో (రూ. 9,242 కోట్లు) రంగాల్లో కూడా అమ్మకాలు కొనసాగాయి. మరోవైపు టెలికాం (రూ.47,109 కోట్లు), ఆయిల్ అండ్ గ్యాస్ (రూ. 9,076 కోట్లు), సర్వీసెస్ (రూ. 8,112 కోట్లు) రంగాల్లో నికర పెట్టుబడులు నమోదయ్యాయి. " వచ్చే ఏడాది 2026లో బడుల ఉపసంహరణ ఆగిపోయే అవకాశం ఉంది. నిఫ్టీ నుండి 12 శాతం రిటర్న్లు వచ్చే అవకాశం ఉండటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు వంటి అంశాలు తిరిగి పెట్టుబడులు రావడానికి దోహదపడవచ్చు" అని బ్యాంక్ ఆఫ్ అమెరికా ఇండియా రీసెర్చ్ హెడ్ అమిష్ షా పేర్కొన్నారు.

'నిధి'లో నిర్మాణ పనుల నమోదు

- శాఖలు, మున్సిపాల్టీలు, పిఎస్‌యులు, 'వర్సిటీ'లకు ప్రభుత్వం ఆదేశం
- పంచాయతీలకు మినహాయింపు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రభుత్వ రంగంలోని పలు ఇంజినీరింగ్ విభాగాల్లో నిర్వహిస్తున్న నిర్మాణ పనులన్నీ ఇకపై నిధి పోర్టల్‌లో నమోదు చేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆర్థికశాఖ శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ రంగ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో చేసే అన్ని ఇంజినీరింగ్ పనులకు ఈ ఆదేశాలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. పంచాయతీలను మాత్రం ఇందుకు మినహాయింపుగా పేర్కొంది. జనవరి ఒకటో తేదీ నుంచి నిధి పోర్టల్‌లోని డిజిటల్ ఎం బుక్‌లో పనుల వివరాలు కొలతలతో సహా నమోదు చేయాల్సి ఉంటుంది.

ఇలా చేయని శాఖలు, సంస్థల డిడిలు, పిఎఒలపై కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించింది. శాఖల నుంచి వచ్చిన పనుల బిల్లులను కూడా వర్క్ అకౌంట్స్ డైరెక్టర్ కార్యాలయం నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో పలు పనులపై వస్తున్న ఫిర్యాదులు, ఆర్థిక అవకతవకలపై దృష్టి సారించేందుకే ఈ నిర్ణయంగా తెలుస్తోంది. ప్రధానంగా రోడ్లు, భవనాలశాఖ, ఇరిగేషన్ వంటి కీలక శాఖల్లో పనులపై కొంతకాలంగా ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇక పంచాయతీల్లో అతి తక్కువ నిధులతోనే పనులు జరుగుతున్న కారణంగా ఈ విధానం నుంచి వాటిని మినహాయించినట్లు సమాచారం.

వైసిపి హయాంలో గ్రామీణాభివృద్ధికి గ్రహణం

- టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో గ్రామీణాభివృద్ధికి గ్రహణం పట్టిందని టిడిపి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పంచాయతీ వ్యవస్థను కూల్చేసి మళ్లీ వారే నీతులు చెబుతున్నారన్నారు. బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత జగన్‌దే అని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యుల హక్కుల్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్రం ఇచ్చిన రూ.13 వేల కోట్లను దారిమళ్లించారని ఆరోపించారు. ఉపాధి హామీ, జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.4,128 కోట్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. నిత్యం తిరుమలపై కుట్రలు చేస్తూ వైసిపి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య మరో సమావేశంలో విమర్శించారు. తిరుమలలోనూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇతర ఆలయాల్లోనూ అనూహ్య రద్దీని సైతం సమర్థవంతంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. దీనిని తట్టుకోలేని వైసిపి.. తొక్కిసలాటలు, ప్రభుత్వ నిర్లక్ష్యం అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టాటా స్టీల్‌పై రూ.14,366 కోట్లకు దావా

- డచ్ ఎన్‌జిఒ న్యాయపోరాటం



న్యూఢిల్లీ : టాటా గ్రూప్‌నకు చెందిన టాటా స్టీల్ నెదర్లాండ్ యూనిట్‌పై డచ్‌కు చెందిన ఒక స్వచ్ఛంద సంస్థ కేసు వేసింది. నెదర్లాండ్స్‌లోని ఆ కంపెనీ కార్యకలాపాల కారణంగా స్థానికుల ఆరోగ్యంపై చెడు ప్రభావం, పర్యావరణ పరంగానూ నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనికి పరిహారంగా 1.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.14,366 కోట్లు) చెల్లించాలని హార్లెంలోని నార్త్ హోలెండ్ డిస్ట్రిక్ట్ కోర్టులో ఎన్‌జిఒ కేసు వేసింది. ఈ విషయాన్ని టాటా స్టీల్ శుక్రవారం ధృవీకరించింది. నెదర్లాండ్స్‌లోని వెల్సన్ నూర్డ్‌లో నిర్వహిస్తున్న టాటా స్టీల్ ఐజ్మోయిడన్ బివి నుంచి వెలువడే కాలుష్యకారకాల వల్ల స్థానికులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆ ఎన్‌జిఒ కేసులో పేర్కొంది.

కోల్‌గేట్‌కు రూ.268 కోట్ల పన్ను నోటీసులు

న్యూఢిల్లీ : ప్రముఖ ఓరల్ కేర్ కంపెనీ కోల్‌గేట్ పామోలివ్ (ఇండియా) లిమిటెడ్ రూ.267.64 కోట్ల పన్ను చెల్లించాలంటూ ఆ కంపెనీకి భారత ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ డిమాండ్ నోటీసులను జారీ చేసింది. దీనిని సవాలు చేస్తూ ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను సంప్రదించనున్నట్లు కోల్‌గేట్ స్పష్టం చేసింది. ఈ పన్ను నోటీసు వల్ల కంపెనీ ప్రస్తుత వ్యాపార కార్యకలాపాలు, ఆర్థిక స్థితి లేదా రోజువారీ పనులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండదని కోల్‌గేట్ పేర్కొంది.

హెచ్‌సిఎల్‌సాఫ్ట్‌వేర్ చేతికి ఎఐస్టార్టప్ వోబి..!

న్యూఢిల్లీ : హెచ్‌సిఎల్ టెక్‌నకు చెందిన సాఫ్ట్‌వేర్ విభాగం అయినా హెచ్‌సిఎల్ సాఫ్ట్‌వేర్ తాజాగా బెల్జియంకు చెందిన ఎఐ స్టార్టప్ సంస్థ వోబిని కొనుగోలు చేయబోతున్నట్లు ప్రకటించింది. తమ డేటా, ఎఐ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ స్వాధీనం మద్దతును అందించనుందని హెచ్‌సిఎల్‌సాఫ్ట్‌వేర్ సిఇఒ మార్క్ పొటెర్ పేర్కొన్నారు.

హ్యాట్రిక్ విజయం.. సిరీస్ కైవసం

- రేణుకకు నాలుగు, దీప్తికి మూడు వికెట్లు
- శ్రీలంక 112పరుగులకే పరిమితం
- మూడో టి20లో భారత్ ఎనిమిది వికెట్ల తేడాతో గెలుపు



షెఫాలీ వర్మ (79నాటౌట్)

తిరువనంతపురం: సిరీస్ చేజిక్కించుకోవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత బౌలర్ రేణుకా సింగ్ ఠాకూర్, దీప్తి శర్మ బంతితో మ్యాజిక్ చేశారు. రేణుక సింగ్ ఠాకూర్ నాలుగు వికెట్లతో రాణించగా.. స్పిన్నర్ దీప్తి శర్మ మూడు వికెట్లతో మెరిసారు. దీంతో టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 112పరుగులకే పరిమితమైంది. అనంతరం సూపర్ ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ అర్ధసెంచరీతో రాణించడంతో భారతజట్టు ఆ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. కేవలం 13.2ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 115పరుగులు చేసి ఘన విజయం సాధించింది. షెఫాలీ వర్మ(79నాటౌట్; 42బంతుల్లో 11ఫోర్లు, 2సిక్సర్లు)కి తోడు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(21నాటౌట్; 18బంతుల్లో 2ఫోర్లు) బ్యాటింగ్‌లో రాణించగా.. మంధాన(1), రోడ్రిగ్స్(9) స్వల్ప స్కోర్లకే పెవీలియన్‌కు చేరారు. దీంతో ఐదు టి20ల సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ సేన 3-0తో చేజిక్కించుకోగా.. నాల్గో టి20 ఆదివారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రేణుకా సింగ్ ఠాకూర్‌కు దక్కింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను ఓపెనర్ హాసిని పెరీరా(25) ధాటిగానే ఇన్నింగ్స్‌ను ప్రారంభించినా.. మరోవైపు కెప్టెన్ ఆటపట్టు(3)ను దీప్తి ఔట్‌చేసి తొలి బ్రేక్ సాధించింది. ఆ తర్వాత రేణుక సింగ్ ఒక్కసారిగా చెలరేగి నాలుగు వికెట్లతో కదం తొక్కింది. డేంజరస్ బ్యాటర్ హర్షిత సమరవిక్రమే(3)ను వెనక్కి పంపింది. దీంతో లంక జట్టు 32పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

దులానీ మెరుపులు...

ఒకవైపు వికెట్లు పడుతున్నా.. వికెట్ కీపర్ ఇమేశా దులానీ(27) క్రీజ్‌లో నిలదక్కుకుంది. మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్ల సాయంతో 27పరుగులతో మెరిసింది. నీలాక్షి(4)ని రేణుక సింగ్ ఎల్బీగా పెవీలియన్‌కు పంపింది. దీంతో శ్రీలంక జట్టు 10ఓవర్లు ముగిసేసరికి 4వికెట్ల నష్టానికి 45 పరుగులే చేసింది. చివర్లో దులానీ-కవిశ దిల్హారీ(20) కలిసి స్కోర్‌బోర్డును సెంచరీ దాటించారు. వీరిద్దరూ 26బంతుల్లో 40పరుగులు చేసి శ్రీలంక జట్టు గౌరవప్రద స్కోర్ చేసేందుకు దోహదపడ్డారు. చివర్లో సత్యంగన(19నాటౌట్) క్రీజ్ నిలవడంతో లంక జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్లు నష్టపోయి 112పరుగులే చేసింది.

స్కోర్‌బోర్డు...

శ్రీలంక ఇన్నింగ్స్: పెరీరా (సి)దీప్తి (బి)రేణుకా సింగ్ 25, ఛమీరా ఆటపట్టు (సి)హర్మన్‌ప్రీత్ (బి)దీప్తి శర్మ 3, హర్షిత (సి అండ్ బి)రేణుక సింగ్ 2, ఇమేషా దులాని (సి)రోడ్రిగ్స్ (బి)రేణుక సింగ్ 27, నీలాక్షి శిల్వ (ఎల్‌బి)రేణుక సింగ్ 4, కవిశా దిల్హారి (సి)అమన్‌జ్యోత్ కౌర్ (బి)దీప్తి శర్మ 20, కౌషాని (నాటౌట్) 19, మల్షా షెహాని (బి)దీప్తి శర్మ 5, మల్కీ మదార(నాటౌట్) 1, అదనం 6. (20 ఓవ్లలో 7వికెట్ల నష్టానికి) 112 పరుగులు.

వికెట్ల పతనం: 1/25, 2/31, 3/32, 4/45, 5/85, 6/90, 7/98

బౌలింగ్: రేణుకా సింగ్ 4-1-21-4, క్రాంతి గాడ్ 4-0-22-0, దీప్తి శర్మ 4-0-18-3, వైష్ణవి శర్మ 3-0-14-0, అమన్‌జ్యోత్ కౌర్ 4-0-23-0, శ్రీచరణి 1-0-11-0

భారత్ ఇన్నింగ్స్: షెఫాలీ వర్మ (నాటౌట్) 79, స్మృతి మంధాన (ఎల్‌బి)కవిషా దిల్హారి 1, జెమీమా రోడ్రిగ్స్ (బి)కవిషా దిల్హారి 9, హర్మన్‌ప్రీత్ కౌర్ (నాటౌట్) 21, అదనం 5. (13.2 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 115పరుగులు.

వికెట్ల పతనం: 1/27, 2/67

బౌలింగ్: మల్షా శెహానీ 2.2-0-28-0, మల్కీ మధార 2-0-11-0, మధుషానీ 2-0-29-0, కవీషా దిల్హారీ 3-0-18-2, రణవీర 4-0-28-0.

ఆంధ్ర శుభారంభం

- రైల్వేస్‌పై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం
- విజయ్ హజారే వన్డే టోర్నీ



విరాట్ కోహ్లి (77పరుగులు)

బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు శుభారంభం చేసింది. తొలి లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో ఓడిన ఆంధ్ర.. శుక్రవారం జరిగిన గ్రూప్-డి రెండో లీగ్ మ్యాచ్‌లో ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ నితీశ్ కుమార్(55) అజేయ అర్ధసెంచరీకి తోడు రికీ బుయ్(76) అర్ధసెంచరీతో రాణించారు. మారమ్రెడ్డి రెడ్డి(41నాటౌట్; 35బంతుల్లో 3ఫోర్లు, 3సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించి మ్యాచ్ ముగించారు. అంతకుముందు టాస్ గెలిచి ఆంధ్ర కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. సత్యనారాయణరాజు, కలిదిండి రాజు మూడేసి వికెట్లకు తోడు మారమ్రెడ్డి రెడ్డి రెండు వికెట్లతో రాణించారు. ఇక రైల్వేస్ జట్టులో అంశ్ యాదవ్(59), రవి సింగ్(76) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో రైల్వేస్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆంధ్ర ఓపెనర్లు కెఎస్ భరత్(25), అశ్విన్ హెబ్బర్(30) తొలి వికెట్‌కు 34పరుగులు జతచేశారు. ఆ తర్వాత వీరిద్దరూ ఔట్ కాగా.. రషీద్(40), రికీ బుయ్, నితీశ్ కుమార్ రెడ్డి మ్యాచ్‌ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మారమ్రెడ్డి రెడ్డికి దక్కింది.

గుజరాత్‌పై ఢిల్లీ గెలుపు

టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లికి తోడు రిషబ్ పంత్ బ్యాటింగ్‌లో రాణించడంతో గుజరాత్‌పై ఢిల్లీ జట్టు ఏడు పరుగుల తేడాతో సంచలన విజయం సాధించింది. విరాట్ కోహ్లి(77; 61బంతుల్లో), పంత్(70; 79బంతుల్లో) అర్ధసెంచరీలతో రాణించడంతో ఆ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 254పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ బౌలర్లు కట్టడిగా బౌల్ చేయడంతో గుజరాత్‌ను 47.4ఓవర్లలో 247పరుగులకే ఆలౌట్ చేశారు. విశాల్ జైస్వాల్ (4/42) బౌలింగ్‌లో రాణించాడు. దీంతో గ్రూప్-డిలో ఢిల్లీ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి టాప్‌లో నిలిచింది.

ఇక జమ్ము-కాశ్మీర్ జట్టు 142 పరుగుల తేడాతో అస్సాంను, ముంబయి జట్టు 51 పరుగుల తేడాతో ఉత్తరాఖండ్‌ను ఓడించాయి. ఇక హైదరాబాద్ జట్టు 89 పరుగుల తేడాతో విదర్భ చేతిలో పరాజయాన్ని చవిచూసింది. విదర్భ జట్టు 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 365 పరుగులు చేయగా.. ఛేదనలో హైదరాబాద్ జట్టు 49.2ఓవర్లలో 276పరుగులకు కుప్పకూలింది.

సంపాదకీయం


మళ్లీ 'ఉన్నావో'

ఎనిమిదేళ్ల క్రితం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన 'ఉన్నావో' అత్యాచార కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న మాజీ ఎంఎల్ఎ కుల్‌దీప్ సింగ్ సెన్‌గర్ జైలు నుండి విడుదలై స్వేచ్ఛగా తిరిగే దుస్థితి ఏర్పడడం పట్ల దేశం యావత్తూ క్షోభిస్తున్నది. కుల్దీప్ సింగ్ సెన్‌గర్ జీవితాంతం జైలులోనే ఉండాలని ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు శిక్షను సస్పెండ్ చేస్తూ అతడికి బెయిల్ మంజూరు చేయడం దారుణం. సెన్‌గర్‌కు తీవ్రమైన నేర చరిత్ర ఉందని, అత్యాచారం వంటి దారుణమైన నేరాల్లో ఆయన ప్రమేయం వున్నదని ఇప్పటికే రుజువైంది. కాబట్టి ఆయన శిక్షను సస్పెండ్ చేయడం చట్టాన్ని, వాస్తవాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. బాధితురాలి తండ్రి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నప్పుడు ఆయన హత్యకు సెన్‌గర్ కుట్ర పన్నాడు. ఆ కుట్ర ఫలితంగానే బాధితురాలి తండ్రి మరణించాడు. అంతేగాక ఈ కేసులో సాక్ష్యాలు లభించకుండా ఉండేందుకు లారీ ప్రమాదం జరిపించడం, బాధితురాలి మేనత్త మరణించిన విషయమూ లోకానికి తెలిసిందే! ఇంతటి దుర్మార్గమైన హీన చరిత్ర కలిగిన సెన్‌గర్‌కు శిక్షను సస్పెండ్ చేయడంతో ఢిల్లీ హైకోర్టు కళ్లు, చెవులూ మూసుకుందా అని జనం ఆగ్రహిస్తున్నారు.

తనపై అత్యాచారానికి పాల్పడిన దుండగుడ్ని కోర్టు అర్ధంతరంగా విడుదల చేయడంతో న్యాయం కోసం బాధితురాలు, ఆమె కుటుంబం రోడ్డెక్కవలసిరావడం అత్యంత విచారకరం. దేశ రాజధానిలో ఇండియా గేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితురాలిని, ఆమె తల్లిని పారా మిలిటరీ బలగాలు ఈడ్చిపారేయడం బిజెపి పాలకుల దుర్నీతికి మచ్చుతునక. న్యాయం కోరిన వారిపై అమానుషంగా, అన్యాయంగా ప్రవర్తించడం సిగ్గుచేటు. ఒక సామూహిక అత్యాచార బాధితురాలి పట్ల ఇలా వ్యవహరించడం గతంలో ఎన్నడైనా జరిగిందా? అదలావుండగా ఎక్కడో ఉత్తరప్రదేశ్‌లో వుండాల్సిన ఆమె ఢిల్లీకి రావడమెందుకు అని బిజెపి నాయకులు వ్యాఖ్యానించడం రాక్షసత్వం తప్ప ఇంకేమనుకోవాలి? వారన్న మాటలనుబట్టి చూస్తే బాధితులెవరూ ఢిల్లీ వెళ్లకూడదా? దేశ పరిపాలకులను, విధాన నిర్ణేతలనూ, ప్రభావశీలురనూ కలవడానికి వీల్లేదా? ఇదీ బిజెపి మార్కు నీతి అని అర్థం చేసుకోవాల్సిందే! ఇది ఉన్నావో బాధితురాలికి జరిగిన, జరుగుతున్న అన్యాయమే కాదు జమ్ము కాశ్మీర్‌లో అత్యాచారానికి గురైన పశువులుకాసే చిన్నారి మొదలు అవమానాలు, లైంగిక వేధింపుల బారినపడ్డ క్రీడాకారిణుల వరకూ బిజెపి పాలన, పాలకుల బాధితులే! 'న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని చెప్పే మనుధర్మ శాస్త్రాన్ని భారత రాజ్యాంగంగా రూపొందించాలని ప్రకటించే శక్తుల నుండి ఇంతకన్నా భిన్నమైన పాలనను ఆశించడం నేతి బీరలో నెయ్యి కోసం వెతకడంలా వుంటుంది.

ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కొందరు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేయడం, సిబిఐ కూడా ఆ దిశగా ప్రయత్నిస్తుందని వెల్లడించినందున సర్వోన్నత న్యాయస్థానంలోనైనా తగు న్యాయం జరగవచ్చునన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే అత్యాచారానికి గురైన బాధితురాలు ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసుల మొదలు బలమైన అధికార పార్టీ నాయకుల దాష్టీకాల బారిన పడింది. కన్నతండ్రిని, మేనత్తను కోల్పోయింది. ఇప్పుడిలా జరుగుతోంది. అనేక విధాలుగా కష్టనష్టాలనుభవిస్తూనే అలుపెరుగని పోరాటం చేస్తున్న బాధితురాలికి అండగా ఐద్వా వంటి సంఘాలు నిలవడం అభినందనీయం. దారుణమైన ఆదేశాలిచ్చిన ఢిల్లీ హైకోర్టు ముంగిటనే శుక్రవారం నాడు నిరసన నిర్వహించారు. బాధితురాలికి మద్దతుగా దేశమంతటా మరింత సంఘీభావం వ్యక్తం కావాలి. అర్ధరాత్రి వేళ మహిళ స్వేచ్ఛగా తిరిగిననాడే నిజమైన స్వాతంత్ర్యమన్న గాంధీజీ కలలు కల్లలు చేస్తున్న ఈ పాలకుల కళ్లు తెరిపించాలి. ఉన్నావో బాధితురాలికి న్యాయం కల్పించాల్సిన బాధ్యత సర్వోన్నత న్యాయస్థానానిదే! అయితే, అక్కడైనా న్యాయం జరగాలంటే ప్రజల ఒత్తిడి కూడా అవసరం. ప్రజాభిప్రాయ ప్రభావం తప్పక ఉంటుంది.

మంచి మాట



సంప్రదాయాలను ధిక్కరించి ముందుకు పోవడానికి అనేక ద్వారాలు అడ్డుగా వున్నాయి. అసంఖ్యాకమైన కావలిదార్లు పహారా కాస్తున్నారు.

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి, నోబెల్ గ్రహీత.

ముగిసిపోతున్న 2025, రానున్న 2026

వ్యాఖ్య

ఇది ఏడాది ముగింపు సంచిక గనక...'పీపుల్స్ డెమోక్రసీ' మా పాఠకులందరికీ రాబోయే నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేస్తున్నది. గడచిపోయిన ఏడాదిని సమీక్షించడం మాకు చాలా ముఖ్యం. తద్వారానే వర్తమానాన్ని అర్థం చేసుకోవడానికి మన మొత్తం శక్తితో ప్రయోజన పూర్వకంగా భవిష్యత్తులో కాలూనేందుకు కావలసిన పట్టు చిక్కుతుంది.

మున్ముందుగానే మేం మా మౌలిక వైఖరిని పునరుద్ఘాటించడం అవసరం. ముఖ్యంగా మన చుట్టూ వున్న ప్రధాన మీడియా కార్పొరేట్ యాజమాన్యాల వలయంలో చిక్కుకుపోయి వుంది. సోషల్ మీడియా పట్టు కూడా అంతకంటే తక్కువేమీ కాదు. ఆ విషయంలో ఫేక్ వార్తలకు, తప్పు సమాచారాలకు భారతదేశం ప్రపంచ ప్రధాన కేంద్రంగా తయారైంది. ఈ ఆవరణంలోనూ పెట్టుబడితో నడిచే బిజెపి ఐ.టి విభాగం కార్యకలాపాలు ప్రాబల్యం వహిస్తున్నాయని చెప్పడం చర్విత చరణమే అవుతుంది. పరస్పర ద్వేషాన్ని, శత్రుత్వాన్ని పెంచడమే దాని ప్రప్రధాన వ్యవహారంగా పని చేస్తుంటుంది.

ఇలాంటి విషపూరిత వాతావరణంలో మేము ఈ విషవలయాన్ని ఛేదించేందుకు భారత ప్రజానీకం ప్రయోజనాల రక్షణ కీలకాంశంగా కావలసిన నివేదికలు, విశ్లేషణలు అందించే కర్తవ్యానికి పునరంకితం అవుతానని 'పీపుల్స్ డెమోక్రసీ' మా పాఠకులకు మరోసారి హామీనిస్తున్నది. అయితే భారత ప్రజా సముదాయమంటే ఎవరు అనే విషయాన్ని కూడా విశదీకరించాలి. ఆ మాటకు అర్థం శ్రమజీవులు (కార్మికవర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులు) అలాగే కోట్ల మంది ప్రజాస్వామిక, లౌకిక భావాలుగల పౌరులు, విద్యార్థులు, యువత పక్కకు నెట్టివేయబడి సామాజిక అసమానతకు హింసకు గురవుతున్న మహిళలు, తమ మనుగడకోసం ఉనికి కోసం పోరాడుతున్న గిరిజనులు, దళితులు, మైనార్టీలేనన్నది నిస్సందేహం.

అసమానతల దెబ్బ

2025లో ప్రపంచ వ్యాపితంగా ప్రత్యేకించి భారత దేశంలో అసమానతలు ప్రమాదకరంగా పెరిగిపోయాయి. సంపదలూ ఆదాయంలో నలభై శాతం కేవలం ఒక్క శాతం మంది గుప్పిట్లో చిక్కింది. అయితే ఆర్థికవేత్తలు, పండితులు, పరిశోధకులు అందరూ కలసి ఈ దుర్మార్గ ధోరణిని వికృత సంపదలూ విపరీత దారిద్ర్యాన్ని ఎండగట్టడం హర్షణీయమవుతున్నది. అసమానతలకు తోడు భారతీయులను వేధిస్తున్న మరో సమస్య నిరుద్యోగం అంతులేకుండా పెరిగిపోతున్నది. ఈ రెండు లక్షణాలూ కలసి ఆర్థిక వ్యవస్థలో సరుకుల మొత్తం గిరాకీని దెబ్బ తీస్తున్నాయి. అందరికీ మేలు చేసేవిధంగా

అసమానతలకు తోడు భారతీయులను వేధిస్తున్న మరో సమస్య నిరుద్యోగం అంతులేకుండా పెరిగిపోతున్నది. ఈ రెండు లక్షణాలూ కలసి ఆర్థిక వ్యవస్థలో సరుకుల మొత్తం గిరాకీని దెబ్బ తీస్తున్నాయి. అందరికీ మేలు చేసేవిధంగా ఆర్థిక వికాసం జరగకుండా అడ్డుపడుతున్నాయి. అయితే దీనివల్ల ప్రజల జీవితాలపై పడే ప్రభావం మాత్రం ప్రజలు మోయవలసి వస్తున్నది. ఈ మధ్య ప్రకటించిన లేబర్ కోడ్‌లు, ఉపాధి హామీ పథకం హుళక్కి చేసేందుకు 'జీ రామ్ జీ' అనే ఆర్భాటపు పేరుతో తెచ్చిన శాసనం జీవనోపాధి సమస్యను ఇంకా జటిలం చేయడం తథ్యం.



ఆర్థిక వికాసం జరగకుండా అడ్డుపడుతున్నాయి. అయితే దీనివల్ల ప్రజల జీవితాలపై పడే ప్రభావం మాత్రం ప్రజలు మోయవలసి వస్తున్నది. ఈ మధ్య ప్రకటించిన లేబర్ కోడ్‌లు, ఉపాధి హామీ పథకం హుళక్కి చేసేందుకు 'జీ రామ్ జీ' అనే ఆర్భాటపు పేరుతో తెచ్చిన శాసనం జీవనోపాధి సమస్యను ఇంకా జటిలం చేయడం తథ్యం. ప్రధాన మీడియా ఒకే వైపు నుంచి జిడిపి పెరుగుదల పైనే ఊదరగొడుతుంటే భారత ఆర్థిక వ్యవస్థ పరిణామం పైనే గొప్ప చిత్రణలు ఇస్తున్నాయి. దాంతో మరోవైపున దేశ ప్రజానీకంలో అత్యధిక భాగం కడగండ్ల పాలవుతున్నారనే కఠోర వాస్తవం కప్పిపుచ్చబడుతున్నది. మానవాళికి సంబంధించిన అయిదు తప్పనిసరి అవసరాలైన కూడు, గూడు, గుడ్డ, చదువు, వైద్యం అనేవి అత్యంత దారుణమైన సంక్షోభంలో చిక్కుకుపోతున్నాయి.

విద్యారంగం, న్యాయం

విద్యారంగంలో ఏం జరుగుతున్నదనేది ప్రత్యేకించి చెప్పుకోవలసి వుంటుంది. ఎందుకంటే ప్రస్తుత పాలనా వ్యవస్థ అతి తీవ్రంగా దాడి చేస్తున్న రంగం ఇదే. విద్య వాణిజ్యీకరణకూ కార్పొరేటీకరణను గట్టిగా తెచ్చిపెడుతూ జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలలు భారీ ఎత్తున మూతపడుతున్నాయి. వికేంద్రీకరణ, రాష్ట్రాలకు న్యాయమైన హక్కులు అనే ప్రాతిపదికపై ఏర్పడిన మొత్తం విద్యా నిర్వహణ వ్యవస్థ చట్రం కూలగొట్టి విపరీతమైన కేంద్రీకరణను రుద్దడం జరుగుతున్నది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో ఇందుకోసం ఉన్నత విద్యామండలిని ఏర్పాటు చేసే శాసనాన్ని ఆమోదించేందుకు బరితెగించి ప్రయత్నం జరిగింది. అదొక సర్వోన్నత సంస్థగా మారి అదివరకటి నిర్మాణాలన్నిటినీ కొరగాకుండా చేస్తుంది. మతతత్వాన్ని కూరడం, మొత్తం మతతత్వంతో నింపడం, చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలను ధ్వంసం చేసే దాడులకు బలం చేకూర్చడం ఈ విధమైన కేంద్రీకరణకు రెండవ లక్ష్యం.

మన రాజ్యాంగంలో న్యాయం అనేది ఒక అవశ్యభాగం. 2025లో అది కూడా దాడికి గురైంది. కులగణన చేయాలని పదే పదే కోర్కెలు వచ్చినా, ఈ విషయమై తీవ్ర ఒత్తిడి తర్వాత ప్రభుత్వం ఒప్పందం చేసుకుని ప్రకటించినా వాస్తవంలో జరిగింది మాత్రం ఏమీ లేదు. అందుకు మారుగా దళితులు, ఆదివాసులు ఈ ఏడాది తీవ్రదాడులకు గురైనారు. జల్, జంగల్, జమీన్ కార్పొరేట్ దురాశలకు మరింతగా గురైనాయి. అటవీ భూముల ఆక్రమణ, మరీ ముఖ్యంగా గనుల తవ్వకం, గిరిజనులను తొలగించడం జరిగిపోయాయి. ఇప్పుడు ఈ సమస్య వాతావరణ న్యాయంతోనూ మొత్తం పర్యావరణ దిగజారుడుతోనూ ముడిపడిపోతున్నది. పట్టణ ప్రాంతాలలో కాలుష్యం తీవ్రత పెరగడం, ఆరావళిపై దాడి ఈ దారుణమైన విధ్వంసానికి అద్దం పడుతున్నాయి. దళితులు, ఆదివాసులు, మైనార్టీలు, మహిళలతో సహా దుర్బల వర్గాలకు న్యాయం, సమానత్వం కల్పించే సమస్య ఇప్పుడు వాతావరణ న్యాయంతో మిళితమైపోతున్నది. మరీ ముఖ్యంగా హిందూత్వ దాడి, మనువాద ఫర్మానాలతో జెండర్ సమస్య విపత్కర స్థాయికి చేరుతున్నది.

మూలాలపై ద్విముఖ దాడి

ఈ మొత్తం పరిణామాల పర్యవసానం, రాజకీయ ప్రజాస్వామ్యం, లౌకిక వాదాలపై వాటి వినాశకర ప్రభావం అర్థం చేసుకోవడం పెద్ద కష్టమైన పనేం కాదు.

అందువల్ల 2026 చాలా బలమైన మార్పులను నొక్కి చెబుతున్నది. డికెన్స్ భాషలో చెప్పాలంటే ఇది నిరాశాభరిత శీతాకాలం పోయి ఆశావహ వసంతానికి దారితీసే అవకాశం కల్పిస్తుంది. ప్రజల సువిశాల ఐక్యత, చైతన్యం, పట్టు వదలని పోరాటాలు ఆ లక్ష్యాన్ని సాధ్యం చేస్తాయి. దీంతోపాటే ప్రత్యామ్నాయం పట్ల స్పష్టత, ఆ లక్ష్య సాధన కోసం ఐక్యతను నిలబెట్టే మార్గాన్ని ఎంచుకోవడం జరగాలి. ఈ మొత్తం మార్గంలో కీలక సంధానకర్తలు ప్రజలే. 2025తో పాటు వదలి పెట్టాల్సినవన్నీ వదలిపెట్టి 2026లో నూతన ఆశాభావాన్ని, సంతోషాన్ని తప్పక ఉదయింపజేయాలి.

ప్రజాస్వామ్యానికి సంబంధించినంత వరకూ 2025లో చెప్పుకోవలిసిందేమంటే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు ముప్పు. అదీ రెండు విధాలుగా. ఎన్నికల బాండ్లను రద్దు చేసిన తర్వాత కూడా ఎన్నికల ట్రస్టులకు కార్పొరేట్ విరాళాలలో దాదాపు 90 శాతం బిజెపి పొందింది. మరో తీవ్రమైన సమస్య భారత ఎన్నికల కమిషన్ బిజెపి జేబు సంస్థగా దిగజారిపోవడం. 'సర్' విషయంలో ప్రజానీకం ఎదురు తిరిగి పోరాడటం సంతోషం కలిగిస్తుంది. అయితే ఈ విడ్డూరపు కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ తన స్వంత నియమావళిని కూడా పాటించలేదని తాజా వాస్తవాలు చెబుతున్నాయి. 'సర్' అనేది అతి పెద్ద తొలగింపు కసరత్తుగా తయారైందని కూడా వివరాలు చెబుతున్నాయి. ఓటింగు హక్కుకు తోడు పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఎన్నికల కమిషన్‌కు కట్టబెట్టడమనే అంశం దీన్ని మరింత జటిలం చేసింది. ఏ చట్టం ఏ నిబంధన లేకుండా కేవలం అమిత్ షా రూపొందించిన 'గాలింపు, తొలగింపు, తరలింపు' అనే తారక మంత్రమే ఏకైక పద్ధతి (స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్)గా మారింది. నిజంగా చెప్పాలంటే ఇది ఒక బూటకంగా మారిపోతున్నది.

ప్రపంచం, పొరుగు దేశాలు

మన చుట్టూ వున్న ప్రపంచాన్ని పరికిస్తే మూడు ప్రధాన ప్రకంపనలు గోచరిస్తాయి. 2025లో అమెరికా పూర్తి మద్దతుతో గాజాలో పాలస్తీనియన్లపై జాతి మారణకాండ సాగింది. వాస్తవానికి గాజా నుంచి అరబ్‌లను నిర్మూలించేందుకు పెద్ద ప్రయత్నమే జరిగింది. అయితే ప్రపంచ వ్యాపితంగా ప్రజానీకం దీన్ని వెనక్కు కొట్టేందుకు పోరాడటం సంతోషం కలిగించే విషయం. చివరకు గతంలో యూదు జాత్యహంకార ఇజ్రాయిల్‌కు సానుభూతిగా వున్న ప్రభుత్వాలు కూడా కాల్పుల విరమణ కోసం ఒత్తిడి పెట్టే పరిస్థితి వచ్చింది. అయినా ఉల్లంఘనలు కొనసాగుతూనే వున్నాయి. మానవాళిపై జరిగిన ఈ నేరాలకుగాను నెతన్యాహును, ఆయన ముఠాను బాధ్యులను చేసి శిక్షించకపోతే ఇవి ఆగబోవు. వెనిజులాలో వలె ఇతర చోట్ల కూడా అమెరికా సరికొత్త దుస్సాహసాలకు పాల్పడుతూనే వుంది. అయితే ఇలాంటి చోట్ల కూడా బహుళ ధ్రువ ప్రపంచ సంకేతాల వల్ల, చైనా దృఢ వైఖరివల్ల అమెరికా ఏకపక్ష ధోరణి గతంలో వలె బలంగా చలామణి అయ్యే పరిస్థితి లేకుండా పోయింది. ట్రంప్ టారిఫ్ టెర్రరిజంతో ఎలాంటి ప్రాబల్యమైతే కోరుకున్నాడో దాన్ని సాధించడంలో విఫలమయ్యాడు.

పొరుగునే వున్న బంగ్లాదేశ్‌లో ఆందోళనకర పరిస్థితి నెలకొన్నది. కేవలం మైనార్టీలకు వ్యతిరేకంగానే గాక-1971 విమోచన పోరాటం తర్వాత రూపొందిన వివేకవంతమైన సంకేతాలన్నిటిపైనా మత చాందసం దురాక్రమణ చేస్తున్న సూచనలు స్పష్టంగా కనపిస్తున్నాయి. బంగ్లాదేశ్‌లోనే గాక ఇండియాలోనూ ముందుకొస్తున్నది ఒకటే. కేవలం మత చాందస, మతతత్వ శక్తులు తీవ్రం కావడం మాత్రమేగాక మొత్తం జాతీయ గుర్తింపు అన్నదాన్నే పూర్తిగా తిరగదోడే ప్రయత్నం. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరోగమింపచేసి మతపరమైన గుర్తింపుతో ముడిపడిన ఒంటెత్తువాద చాందస జాతీయతగా మార్చడానికి ప్రయత్నం జరుగుతున్నది.

సువిశాల ఐక్యత దిశలో..

అందువల్ల 2026 చాలా బలమైన మార్పులను నొక్కి చెబుతున్నది. డికెన్స్ భాషలో చెప్పాలంటే ఇది నిరాశాభరిత శీతాకాలం పోయి ఆశావహ వసంతానికి దారితీసే అవకాశం కల్పిస్తుంది. ప్రజల సువిశాల ఐక్యత, చైతన్యం, పట్టు వదలని పోరాటాలు ఆ లక్ష్యాన్ని సాధ్యం చేస్తాయి. దీంతోపాటే ప్రత్యామ్నాయం పట్ల స్పష్టత, ఆ లక్ష్య సాధన కోసం ఐక్యతను నిలబెట్టే మార్గాన్ని ఎంచుకోవడం జరగాలి. ఈ మొత్తం మార్గంలో కీలక సంధానకర్తలు ప్రజలే. 2025తో పాటు వదలి పెట్టాల్సినవన్నీ వదలిపెట్టి 2026లో నూతన ఆశాభావాన్ని, సంతోషాన్ని తప్పక ఉదయింపజేయాలి. 2026 ఫిబ్రవరి 12న ట్రేడ్ యూనియన్ల ఉమ్మడి వేదిక ఇచ్చిన పిలుపునకు సంయుక్త కిసాన్ మోర్చా పూర్తి మద్దతు ప్రకటించింది. లేబర్ కోడ్‌లు, అలాగే ప్రభుత్వం అనుసరించే అన్ని రకాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించడానికి ఇదొక నిర్దిష్ట అవకాశం కల్పిస్తుంది. అత్యధిక విశాల ఐక్యతను పెంపొందించడం ద్వారా మరింత శక్తివంతమైన పోరాటాలకు అవసరమైన భూమికను సృష్టించేందుకు వీలేర్పడుతుంది.

(డిసెంబర్ 24 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

అభిప్రాయం

పరిశ్రమల్లో రక్షణ డొల్ల

దేశంలోని పరిశ్రమల్లో భద్రతా చర్యలపై తగిన శ్రద్ధ తీసుకోకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. అత్యధిక ప్రమాదాలు, మరణాలు రసాయన కంపెనీల్లో చోటు చేసుకుంటున్నాయి. పరిశ్రమాధిపతుల కోసం ప్రభుత్వాలు పరిశ్రమల తనిఖీ, కార్మికుల భద్రత, రక్షణ వంటి అంశాలపై పని చేసే వ్యవస్థలను బలహీనం చేయడంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోంది. దేశంలో ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ లలో ఈ ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. 2022లో సెంటర్ ఫర్ సైన్సు అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ) నిర్వహించిన అధ్యయనంలో గడచిన రెండున్నర సంవత్సరాల్లో దేశంలో 130కి పైగా జరిగిన రసాయన ప్రమాదాల్లో 218 మరణాలు సంభవించగా, 300 కంటే ఎక్కువ మంది గాయపడ్డారని గుర్తించింది. గత ఐదేళ్లలో ఎ.పి లో సుమారు 119కి పైగా జరిగిన ప్రమాదాల్లో 150 మంది మృతి చెందినట్లు వసుధ మిశ్రా కమిటీ తెలిపింది.



భద్రతకు పరిశ్రమాధిపతులు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు చోటుచేసుకుంటున్నాయని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకటించింది. అనకాపల్లి జిల్లాలోని పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లోని 138 ఔషధ, రసాయన పరిశ్రమల్లో 40 వేల మంది, ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్.ఇ.జెడ్)లో మరో 20 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అచ్యుతాపురంలోని అసెన్షియ కంపెనీలో ప్రమాదం యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగినట్లు పరిశ్రమల తనిఖీ ఇన్‌స్పెక్టర్ల విచారణలో తేలింది. బెయిల్‌పై బయటకు వచ్చేలా కంపెనీ యాజమాన్యంపై 106(1),125(బి), 125(ఎ) సెక్షన్ల కింద పోలీసు కేసు నమోదుచేశారు. సేఫ్టీ ఆడిట్ క్రమం తప్పకుండా నిర్వహించి, లోపాలను సరిదిద్దేలా చూడాల్సిన ప్రభుత్వం, ఆ బాధ్యత, పర్యవేక్షణ నుంచి తప్పుకొని యజమానుల కొమ్ము కాసే విధానాలు అమలు చేస్తోంది. అనుమతుల జారీకి కాలపరిమితి విధించి ఎటువంటి తనిఖీలు చేయకుండా, భౌతిక పరిశీలన లేకుండా అనుమతులు ఇచ్చే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని ముందుకు తెచ్చింది.

ఉత్పత్తి క్రమంలో ప్రమాదాలు జరగకుండా తగిన నియంత్రణా చర్యలు చేపట్టని యాజమాన్యాలపై కనీస చర్యలు తీసుకొనే అవకాశం లేకుండా ప్రభుత్వాలు చేస్తున్నాయి. తాజాగా లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులకు హక్కుల్లేకుండా మోడీ ప్రభుత్వం చేసింది. ఆ యా శాఖలకు భద్రతపై పర్యవేక్షించే అధికారాలను కత్తిరించింది. అన్ని వైపుల నుంచి కార్మికులపై దాడికి దిగి, కార్పొరేట్ సంస్థలు, ధనికులకు లాభాలు చేకూర్చేందుకు నేనున్నానని ప్రభుత్వం భరోసా ఇస్తుంది. కార్మికుల ప్రాణాలకు ఏ విలువా లేనట్లు, వారు మనుషులు కానట్లు చూస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేయాల్సిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిపై కూడా ప్రభుత్వాలు శ్రద్ధ చూపడంలేదు.

పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు ఆడిట్ నిర్వహించాలి. గుర్తించిన లోపాలను సరిచేయాలి. కార్మికులకు ప్రతీ పరిశ్రమలో భద్రతా పరికరాలు ఇచ్చేలా ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ పెరగాలి. భద్రతకు ప్రాధాన్యత ఇవ్వని పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలి. పని ప్రదేశంలో విద్యార్హతలు కల్గిన నైపుణ్య కార్మికులను నియమించాలి. భద్రతపై చర్యలు తీసుకోని ఫలితంగా ప్రమాద ముప్పు కార్మికులపై పొంచి వుంది. ప్రమాదకర రసాయనాల విడుదలతో ఏ చిన్న ప్రమాదం జరిగినా కార్మికుల ప్రాణాలు పోతున్నాయి. వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రసాయనాల శుద్ధిపై దృష్టి పెట్టక పోవడంతో నేల, గాలి, నీరు కలుషితమై ప్రజలు జబ్బుల పాలవుతున్నారు. పారిశ్రామిక ప్రమాదాల నివారణకు నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ సూచనలు అమలుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రాష్ట్రంలో పరిశ్రమల తనిఖీ శాఖలో ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ల ఖాళీలను భర్తీ చేసి తనిఖీలు పెంచాలి. పరిశ్రమలో ప్రమాదాలకు యాజమాన్యాన్ని బాధ్యులను చేసి క్రిమినల్ కేసులు పెట్టాలి. వలస కార్మికుల వివరాలను తహశీల్దార్ కార్యాలయంలో నమోదు చేయాలి. 8 గంటలకు మించి ఉచితంగా పని చేయించుకుంటున్న యజమానులపై కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాలి. పరిశ్రమలలో పర్మినెంట్ కార్మికుల నియామకాలు చేపట్టాలి. కార్మికులు అప్రమత్తమై తమకు జరుగుతున్న అన్యాయంపై సంఘటితం కావాలి. హక్కుల రక్షణ, సాధనకు ఐక్యంగా పోరాడాలి.

- గనిశెట్టి సత్యనారాయణ
పరవాడ ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు.

విమర్శ

పి.డి చట్టం - రెండు కేసుల పరిశీలన

అనకాపల్లి జిల్లా ప్రజా ఉద్యమ నేత, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ (పి.డి యాక్టు) బనాయించి అరెస్ట్ చేయడంతో, ఆ చట్టాన్ని దుర్వినియోగ పరుస్తున్న తీరు చర్చనీయాంశమైంది. పి.డి చట్టాన్ని దుర్వినియోగపరచడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీనికి సంబంధించిన రెండు కేసులను, వాటిపై సుప్రీంకోర్టు స్పందనను చూద్దాం. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో నమోదైన అమీనా బేగం, నేనావత్ బుజ్జి కేసులు పి.డి యాక్టు వినియోగానికి సంబంధించి ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సమాజాన్ని తీవ్రంగా కుదిపేసి, భవిష్యత్తులో తీవ్ర ప్రమాదానికి దారి తీసే చర్యలను అడ్డుకోవడమే పి.డి యాక్టు అసలు ఉద్దేశం. కానీ, ప్రభుత్వాలు తమ రాజకీయ కక్ష సాధనకోసం, ప్రజా ఉద్యమాలను అణచి వేయడం కోసం ఆ లక్ష్యాన్ని పక్కదోవ పట్టిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో సాధారణ క్రిమినల్ కేసులకు కూడా శాంతి భద్రతల ముద్ర వేసి పి.డి చట్టాన్ని బనాయిస్తున్నాయి. ఇదే విషయాన్ని అమీనా బేగం (2023), నేనావత్ బుజ్జి (2024) కేసులు స్పష్టంగా బట్టబయలు చేశాయి.

అమీనా బేగం కేసులో ఆమె భర్తపై ఉన్న కొన్ని సాధారణ కేసులను కలిపి పోలీసులు పి.డి యాక్టు బనాయించి అరెస్ట్ చేశారు. దీనిని ఆమె అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. జస్టిస్ ఎస్.రవీంద్ర భట్, జస్టిస్ అరవింద కుమార్ నేతృత్వంలోని ద్వి సభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. విచారణ సందర్భంగా ఆయనపై నమోదైన కేసులు కేవలం సాధారణ క్రిమినల్ స్వభావమే అన్న విషయాన్ని ధర్మాసనం గుర్తించింది. దీంతో కేసును పూర్తిగా కొట్టివేసింది. 'లా అండ్ ఆర్డర్ సమస్యలు పబ్లిక్ ఆర్డర్ సమస్యలు ఒక్కటి కాదు' అని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఆ కేసులో ముద్దాయి చేసిన నేరాలు సమాజం మొత్తాన్ని కలవరపరిచే స్థాయిలో లేవని, ఆ కేసులకు సంబంధించి ఆ వ్యక్తి అప్పటికే బెయిల్‌పై ఉన్నారని గుర్తుచేసింది. బెయిల్‌పై



ఉన్న వాస్తవాన్ని పట్టించుకోకపోవడం, అడ్వైజరీ బోర్డు యాంత్రికంగా సమీక్ష జరపడం అన్యాయమని పేర్కొంది. ఈ చర్యలన్నీ వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం ఇచ్చిన హామీకి విరుద్ధమని కూడా స్పష్టం చేసింది.

ఈ తీర్పు తరువాత కూడా పి.డి యాక్టును వినియోగించడంలో ప్రభుత్వంలో మార్పు కనిపించ లేదు. నేనావత్ బుజ్జి కేసు (2024)లో ఈ ధోరణి మరింత స్పష్టంగా కనిపించింది. కొన్ని చైన్ స్నాచింగ్ సంఘటనలను ఆధారంగా చేసుకుని పి.డి చట్టాన్ని బనాయించారు. ఈ కేసులో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ జె.బి పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. విచారణ సందర్భంగా పోలీసుల తీరును ధర్మాసనం తీవ్రంగా తప్పు పట్టింది. 'ప్రజల్లో భయం కలుగుతోంది' వంటి వ్యాఖ్యలతో పోలీసులు ఈ కేసు పెట్టారని, సాధారణ వ్యాఖ్యలు చాలవని, సమాజానికి ఉన్న ప్రభావం ఏమిటో స్పష్టంగా కనిపించాలని, ఆ స్థాయి లేకపోతే 'పబ్లిక్ ఆర్డర్' అన్న ప్రశ్నే తలెత్తదని స్పష్టం చేసింది. అంతేకాదు, పాత కేసులు, అనుబంధ సంఘటనలు, ఊహాజనిత అంశాలను డిటెన్షన్ ఆర్డర్‌కు ఆధారంగా చూపడం రాజ్యాంగ విరుద్ధమని తేల్చి చెప్పింది.

ఈ రెండు కేసుల్లోనూ సుప్రీంకోర్టు ఇచ్చిన సందేశం ఒకటే! ప్రివెంటివ్ డిటెన్షన్ (పి.డి) అనేది శిక్ష కాదు. అసాధారణ పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన ఒక నివారణాత్మక చర్య మాత్రమే! కానీ ప్రభుత్వాలు అందుకు భిన్నంగా దీనిని వినియోగిస్తున్నాయి. తాజాగా అప్పలరాజుపై బనాయించిన పి.డి కేసు విషయంలోనూ స్పష్టమౌతున్నది అదే! ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డదిడ్డంగా చేస్తున్న కేటాయింపులను ఆయన ప్రశ్నించారు. బాధిత ప్రజలను చైతన్యపరిచి భూ దోపిడిని అడ్డుకున్నారు. ఈ సంఘటనలకు సంబంధించి అనేక కేసులు ఇప్పటికే ఆయనపై పెట్టారు. వీటిలో కొన్నింటిని కోర్టులు కొట్టివేశాయి. మరికొన్ని విచారణ దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు, విచారణ, సాక్ష్యాలు, బెయిల్ తదితర న్యాయ ప్రక్రియలతో సంబంధంలేని పి.డి యాక్టు కింద అప్పలరాజును జైలుకు పంపడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. పై రెండు కేసుల్లో రాజ్యాంగం నిర్దేశించినట్టు, ఇవి డిటెన్షన్ ఆర్డర్లను స్వతంత్రంగా, స్వేచ్ఛగా సమీక్షించాల్సిన అడ్వైజరీ బోర్డులు దానికి భిన్నంగా యాంత్రికంగా వ్యవహరించినట్లు ధర్మాసనాలు అభిప్రాయపడ్డాయి. అధికారుల అభిప్రాయాలకు గుడ్డిగా ఆమోద ముద్ర వేసినట్లు భావించాయి. ఈ ధోరణి రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 22(5)లను ధిక్కరించడమేనని పేర్కొన్నాయి. అప్పలరాజుపై బనాయించిన కేసు విషయంలో అడ్వైజరీ బోర్డు ఎలా వ్యవహరిస్తుందో చూడాల్సి ఉంది.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

పరకామణిలో చోరీ కేసుపై ఏసిబి నివేదిక

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసులో నిందితుడు రవికుమార్, అతని కుటుంబ సభ్యుల ఆస్తులపై ఏసిబి దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు నివేదించింది. విచారణను జనవరి 5కు వాయిదా వేశారు. ఇప్పటికే దర్యాప్తు కొలిక్కి వచ్చిందని, వేర్వేరు అంశాలతో ముడిపడిన కేసు కాబట్టి మరో ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసే అంశాన్ని పోలీసులు పరిశీలించాలని సూచించారు. పరకామణిలో చోరీ కేసును టిటిడి బోర్డు లేదా ఇఒ అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్‌లో ఎవిఎస్ఒ వై సతీష్ కుమార్, నిందితుడు రవికుమార్ కలిసి కేసును రాజీ చేసుకున్నారు. కేసును లోకాయుక్తలో రాజీ చేసుకోవడాన్ని సవాల్ చేసిన వ్యాజ్యాన్ని గతంలో విచారించిన న్యాయమూర్తి... పరకామణిలో చోరీ కేసు నిందితుడి ఆస్తులపై ఏసిబి దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పునరుద్ధరణకు అసెంబ్లీలో తీర్మానించాలి

• పలు రాజకీయ పార్టీల డిమాండ్



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్రం గ్రామీణ పేదలకు అన్యాయం చేస్తూ కొత్తగా తెచ్చిన విబి జి ఆర్ఎఎం జి పథకాన్ని రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) పునరుద్ధరించాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని పలు రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో గుంటూరులోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వై నేతాజి అధ్యక్షత వహించగా మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ్‌కుమార్, సిపిఐ నాయకులు కె రాధాకృష్ణమూర్తి, సిపిఐ (ఎంఎల్) ప్రజాపోరు నాయకులు పి.కోటేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) నాయకులు యు నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వి నరసింహారావు, విసికె పార్టీ నాయకులు జయసుధ, బిఎస్‌పి నాయకులు సిహెచ్ వాసు, జెడియు నాయకులు ఎస్.సాంబశివరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ చట్ట సవరణ వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.4259 కోట్లకుపైగా భారం పడుతుందన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు నోరు మెదపట్లేదని, పేదలకు అన్యాయం చేస్తూ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విబి జి ఆర్ఎఎం జి పథకానికి రాష్ట్రంలోని ఎంపిలు ఆమోదం తెలిపారని విమర్శించారు. పేదల వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న అధికార, ప్రధాన ప్రతిపక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ పునరుద్ధరణ కోసం ఇప్పటికే ఉద్యమం ప్రారంభమైందని, రానున్న కాలంలో దీనిని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'వట్లూరు' రైతులకు న్యాయం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా, వట్లూరులో రైతుల నుంచి తీసుకున్న 340 ఎకరాల భూములకు నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో ఆ భూములను తిరిగి రైతులకే అప్పగించేందుకు తగు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆయన శుక్రవారం లేఖ రాశారు. వట్లూరులో భూములు కోల్పోయిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. వెమ్ టెక్నాలజీ (విమానాల విడిభాగాల తయారీ) పరిశ్రమ ఏర్పాటు పేరుతో రైతుల నుంచి సేకరించిన భూములకు ఇప్పటికీ పరిహారం ఇవ్వకపోగా, పరిశ్రమను స్థాపించలేదన్నారు. ఈ భూముల్లో దశాబ్ద కాలంగా అక్కడి రైతులు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో రైతు కుటుంబాలు అవసరాల కోసం విక్రయించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, లేనిపక్షంలో భూములను తిరిగి రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పూర్తయింది 26.76 శాతమే

• పోలవరం పునరావాసంపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ తాజా నివేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రభుత్వాలు పునరావాసం అంశాన్ని పక్కనపెట్టేస్తున్నాయి. కాంక్రీటు పనులపై ఉన్న శ్రద్ధ ముంపునకు గురవుతున్న గిరిజనుల ప్రజలకు న్యాయం చేయడంపై చూపించడం లేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు పురోగతిపై కేంద్రానికి నివేదిక పంపించింది. ఈ నివేదిక ప్రకారం మొత్తం ప్రాజెక్టుకు సంబంధించి 82.69 శాతం సివిల్ వర్కులు పూర్తయ్యాయి. భూ సేకరణ, ఆర్అండ్ఆర్ 26.76 శాతం మాత్రమే పూర్తయింది. ప్రాజెక్టు భూ సేకరణ మొదటిదశలో 87.07 శాతం, ఆర్అండ్ఆర్ కుటుంబాల తరలింపు 37.75 మాత్రమే పూర్తయిందని తెలిపింది. మొత్తం ప్రాజెక్టు అన్నిదశలతో కలిపితే భూసేకరణ 69.92 శాతం, ఆర్అండ్ఆర్, కుటుంబాల తరలింపు 14.90 శాతం పూర్తయిందని తెలిపింది. ఎర్త్‌వర్కు 79.73 శాతం, కాంక్రీటు పనులు 85.01 శాతం, స్టీలు వర్కు 86.84 శాతం పూర్తయినట్లు నివేదికలో పేర్కొంది. మెయిన్ కెనాల్స్‌కు సంబంధించి ఎర్త్‌వర్కు 98.04 శాతం, లైనింగ్ 86.20 శాతం, స్ట్రక్చర్స్ 82 శాతం పూర్తయినట్లు తెలిపింది.

ఇంకా సేకరించాల్సింది 8973 ఎకరాలు

భూసేకరణ మొదటిదశ 41.15 మీటర్లకు సంబంధించి 1,00,099.58 ఎకరాలు సేకరించాల్సి ఉండగా ఈ ఏడాది అక్టోబరు 30వ తేదీ నాటికి 86,984.94 ఎకరాలు సేకరించారు. డిసెంబరు మూడోతేదీ నాటికి 91,125.96 ఎకరాలు అంటే గతంతో పోల్చుకంటే 4141.02 ఎకరాలు అదనంగా సేకరించారు. ఇంకా 8973.62 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

తరలించాల్సినవి 17,765 కుటుంబాలు

మొదటిదశకు సంబంధించి 172 నివాస ప్రాంతాల నుండి 38,060 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఈ ఏడాది అక్టోబరు 30 నాటికి 19954 కుటుంబాలను తరలించారు. డిసెంబరు మూడోతేదీ నాటికి 20,295 కుటుంబాలను తరలించారు. ఇంకా 17,765 కుటుంబాలను తరలించాల్సి ఉంది. వీటిల్లో 472 కుటుంబాలు కాకినాడ జిల్లా పరిధిలో కాలువ ఏర్పాటులో ఉన్నాయి. మిగిలినవి ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోవి.

72 కాలనీలకు 49 మాత్రమే పూర్తి

మొదటిదశ పునరావాసానికి సంబంధించి మొత్తం 75 కాలనీలు నిర్మించాల్సి ఉండగా అందులో 26 కాలనీలను పూర్తి చేశారు. వీటిల్లోకి 3,780 కుటుంబాలను తరలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 49 కాలనీలు నిర్మాణదశలో ఉన్నాయని తెలిపారు. ఇందులో 13938 నివాసాలకు సంబంధించి ఇంజనీరింగ్ డిపార్టుమెంటు రీ టెండర్లు పిలుస్తోందని, జనవరి మొదటివారంలో పనులు మొదలుపెడతామని తెలిపారు.

2026 నాటికి నీరు అందించడమే లక్ష్యం : నిమ్మల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెలిగొండ ప్రాజెక్టును 2026 నాటికి పూర్తిచేసి నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుపై శుక్రవారం వెలగపూడి సచివాలయం నుంచి కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2026 జూన్ నాటికి లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సీజన్ మొదలయ్యేనాటికి పనులన్నీ పూర్తవ్వాలని తెలిపారు. 2026 జూన్ నాటికి టన్నెల్-2లో మిగిలిన లైనింగ్ పనులు పూర్తి చేయాలని అందుకనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలని ఆదేశించారు. టన్నెల్-2లో ఏడు కిలోమీటర్ల లైనింగ్ పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటికే 3, 2 కిలోమీటర్లు పూర్తయ్యాయని, మిగిలిన 3.6 కిలోమీటర్ల పనులు 2026 జూన్‌కు పూర్తి చేసేలా లక్ష్యాన్ని పెట్టుకోవాలని తెలిపారు. మొంథా తుపానుతో టన్నెల్‌లోకి నీరు రావడంతో పనులు ఆలస్యమయ్యాయని పేర్కొన్నారు. డిసెంబరులో నిర్దేశించిన పనులు దాదాపు 90 శాతం పూర్తయ్యాయని అన్నారు. టన్నెల్-2లో చిక్కుకున్న బోరింగు మెషిన్‌ను తొలగించడానికి ఏర్పాటు చేసిన టెక్నికల్ కమిటీ నివేదికను అందజేసిందని తెలిపారు. ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వెంటనే మొదలుపెట్టి సీజన్ ముగిసేలోగా పూర్తి చేయాలని అధికారులకు ఏజెన్సీకి ఆదేశాలు జారీ చేశారు. సమీక్షలో జలవనరులశాఖ సలహాదారులు వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి, ప్రాజెక్టు సిఇ శ్యామ్‌ప్రసాద్, ఎస్‌సి అబూతలెం తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్ల తీరుపై పెమ్మసాని ఆగ్రహం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో ప్రైవేటు బ్యాంకులు ప్రజలకు అవసరమైన రుణాలు ఇవ్వకపోవడంపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గత ఏడాది కాలంలో రైతులు, కౌలు రైతులు, చిరు వ్యాపారులు, ఇతర ప్రాయోజిత పథకాలకు రుణాలు ఇవ్వడంలో ప్రైవేటు బ్యాంకులు పూర్తిగా వెనుకబడ్డాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ బ్యాంకులు కూడా రుణాల మంజూరులో కొంత ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. కౌలు రైతులకు గత ఏడాది రూ.39 కోట్లు ఇవ్వగా, ఈ ఏడాది రూ.111 కోట్లు ఇచ్చారన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి 50 శాతం రుణాలు కూడా ఇవ్వలేదన్నారు. ప్రధానంగా పిఎం సూర్యఘర్ పథకానికి ఏడు వేల దరఖాస్తులు రాగా కేవలం 3,800 దరఖాస్తులకు బ్యాంకర్లు ఆమోదించారని తెలిపారు. విద్యా రుణాల లక్ష్యం రూ.198 కోట్లు కాగా, కేవలం రూ.49 కోట్లు ఇచ్చారని, పిఎం విశ్వకర్మ పథకానికి 2,500 దరఖాస్తులు రాగా, వీటిల్లో కేవలం వెయ్యి మందికి అంగీకార పత్రాలు ఇచ్చారని అన్నారు. ముద్రా రుణాలు 684 మందికి ఇచ్చినట్టు అధికారులు మంత్రికి నివేదించారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే గళ్లా మాధవి, హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు రూ.90.50 కోట్లు విడుదల

• మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివిధ ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని బిసి విద్యార్థులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పిఎం యశస్వి పథకంలో స్కాలర్ షిప్‌ల రెండవ విడత మొత్తాన్ని పంపిణీ చేసేందుకు రూ.90.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ మొత్తంలో పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు రూ.69.40 కోట్లు, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు రూ.21.10 కోట్లు ఉన్నాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసి బిడ్డల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తల్లికి వందనం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. బిసి వసతి గృహాలు, గురుకులాల అభివృద్ధికి పెద్దయెత్తున నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గురుకులాల్లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్లు ఏర్పాటుచేసి ఐఐటి, నీట్ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందజేస్తున్నామన్నారు. బిసి విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

రియల్ ఎస్టేట్ డీలా

- టాప్ 7 నగరాల్లో 14 శాతం తగ్గిన అమ్మకాలు
- హైదరాబాద్‌లో 23 శాతం క్షీణత
- చెన్నయ్‌లో మాత్రమే పెరుగుదల
- అన్‌రాక్ రిపోర్ట్

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మందగమనంలోకి జారుకుందని మరో రిపోర్ట్ స్పష్టం చేస్తోంది. ఈ ఏడాది 2025లో దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో నివాస అమ్మకాలు 14 శాతం తగ్గాయని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ అన్‌రాక్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఇళ్ల ధరలు పెరగడం వల్ల మొత్తం విక్రయాల విలువ మాత్రం 6 శాతం పెరిగి రూ.6 లక్షల కోట్లకు పైగా నమోదయ్యింది. కానీ సంఖ్యా పరంగా భారీ తగ్గుదల చోటు చేసుకోవడం ఆందోళనకరం. అత్యంత కీలకమైన నిర్మాణ రంగం డీలా పడటం ఆర్థిక వ్యవస్థకు సవాళ్లను విసరనుంది.

దేశంలోని టాప్ 7 నగరాల్లో నివాసాల సగటు చదరపు అడుగు ధర 8 శాతం పెరిగి రూ.9,260కి చేరింది. అత్యధికంగా ఢిల్లీ ఎన్‌సిఆర్ ప్రాంతంలో ధరలు 23 శాతం పెరిగాయి. ఇక్కడ కొత్త ఇళ్లలో 55 శాతం కంటే ఎక్కువ రూ.2.5 కోట్ల పైగా ధర కలిగిన విలాసవంతమైన ఇళ్లే ఉండటం విశేషం.

ఏడు ప్రధాన నగరాల్లో 2024లో మొత్తంగా 4,59,645 యూనిట్ల అమ్మకాలు జరగ్గా.. 2025లో ఈ సంఖ్య 3,95,625కి తగ్గింది. ఐటి రంగంలో ఉద్యోగ కోతలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, పెరిగిన ఆస్తి ధరల వల్ల అమ్మకాల్లో మందగమనం చోటు చేసుకుంది. ఏడింటిలో కేవలం ఒక్క చెన్నయ్‌లో మాత్రమే 15 శాతం పెరుగుదలతో 22,180 యూనిట్ల విక్రయాలు జరిగాయి. మిగితా ఆరు నగరాల్లో క్షీణత చోటు చేసుకుంది. హైదరాబాద్‌లో 2024లో 58,540 యూనిట్ల అమ్మకాలు జరగ్గా.. 2025లో 23 శాతం పతనమై 44,885 యూనిట్లకు పరిమితమయ్యాయి.

నగరం	విక్రయాలు	తగ్గుదల (శాతంలో)
ముంబయి	1,27,875	18 శాతం
పూణె	65,135	20 శాతం
బెంగళూరు	62,205	5 శాతం
ఢిల్లీ ఎన్‌సిఆర్	57,220	8 శాతం
హైదరాబాద్	44,885	23 శాతం
కోల్‌కత్తా	16,125	12 శాతం

పెరిగిన నిల్వలు..

2025లో కొత్త ఇళ్ల అభివృద్ధి రెండు శాతం పెరిగి 4.19 లక్షల యూనిట్లకు చేరుకున్నాయని అన్‌రాక్ తెలిపింది. ఇందులో రూ.2.5 కోట్ల పైగా విలువ చేసే లగ్జరీ ఇళ్ల వాటా 21 శాతానికి పెరిగింది. ఇది 2024లో 18 శాతంగా ఉంది. టాప్ 7 నగరాల్లో అమ్ముడుపోని ఇళ్ల నిల్వ 4 శాతం పెరిగి 5.77 లక్షల యూనిట్లకు చేరింది. కాగా.. హైదరాబాద్‌లో కొత్త నివాసాల సరఫరా తగ్గడం వల్ల అమ్ముడుపోని ఇళ్ల నిల్వలో రెండు శాతం స్వల్ప తగ్గుదల నమోదయ్యింది. బెంగళూరులో మాత్రం ఇది అత్యధికంగా 23 శాతం పెరిగింది. "2026లో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవాలంటే ఆర్‌బిఐ వడ్డీ రేట్లను తగ్గించడం, బిల్డర్లు ధరలకు కోత పెట్టాల్సిన అవసరం ఉంది." అని అన్‌రాక్ గ్రూప్ ఛైర్మన్ అనుజ్ పూరి పేర్కొన్నారు.



సెన్సెక్స్ 367 పాయింట్ల పతనం

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్‌లు వరుసగా మూడో రోజూ నష్టాలను చవి చూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలకు తోడు, సూచీలను ముందుకు నడిపించే అంశాలేవీ లేకపోవడం.. ప్రధానంగా ఐటి, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సెన్సెక్స్, నిఫ్టీలను నష్టాలకు గురి చేశాయి. శుక్రవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 367.45 పాయింట్లు లేదా 0.43 శాతం కోల్పోయి 85,041కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 99.80 పాయింట్లు లేదా 0.38 శాతం తగ్గి 26,042 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.23 శాతం, స్మాల్ క్యాప్ 0.08 శాతం చొప్పున తగ్గాయి. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టిసిఎస్, ఎటెర్నల్ షేర్లు నష్టాలు చవి చూశాయి. టైటాన్, ఎన్‌టిపిసి, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

డాలర్‌తో రూపాయి తగ్గుదల

న్యూఢిల్లీ : భారత రూపాయి విలువ పడిపోయింది. ప్రపంచ ద్రవ్య మార్కెట్‌లో గత కొంత కాలంగా క్రమంగా తగ్గుతూ వస్తోన్న దేశీయ కరెన్సీ శుక్రవారం 15 పైసలు బలహీనపడి రూ.89.65కి పడిపోయింది. ఉదయం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్సేంజ్‌లో డాలర్‌తో రూపాయి విలువ 89.84 వద్ద తెరుచుకుంది. ఇంట్రాడేలో 23 పైసలు పతనమై ఏకంగా 89.94 కనిష్టాన్ని చవి చూసింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూపాయి విలువ దాదాపు ఆరు శాతం క్షీణించింది. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య చర్చలు దీర్ఘకాలంగా నిలిచిపోవడం, విదేశీ పెట్టుబడిదారుల భారీ ఉపసంహరణలు, వాణిజ్యలోటు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌కు డిమాండ్ పెరగడం వంటి కారణాల నేపథ్యంలో భారత రూపాయి ఒత్తిడిని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.

పెదనందిపాడుకు గవర్నర్ దంపతులు

ప్రజాశక్తి - పెదనందిపాడు (గుంటూరు జిల్లా)

గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శుక్రవారం గుంటూరు జిల్లా పెదనందిపాడు మండల కేంద్రానికి సతీసమేతంగా వచ్చారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావును గవర్నర్ కలిశారు. స్థానికంగా ఉంటున్న జస్టిస్ నాగేశ్వరరావుతో గతంలో గవర్నర్ కలిసి పని చేశారు. ఈ మేరకు నాగేశ్వరరావు ఆహ్వానంతో ఆయన ఇంటికి గవర్నర్ వచ్చినట్లు తెలిసింది. కొద్దిసేపు అక్కడ ఉండి తిరిగి వెళ్తుండగా స్థానిక అశోక పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రోడ్డుపై జాతీయ జెండాలతో నిల్చొని ఉండడాన్ని గవర్నర్ గమనించి కాన్వాయ్‌ను ఆపించారు. విద్యార్థులతో కొంతసేపు మాట్లాడి వెళ్లిపోయారు.

నిమ్మకూరులో నారా భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - పామర్రు (కృష్ణా)

రేపటి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థి దశ నుండే ప్రణాళికతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్‌టిఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఛైర్మన్ నారా భువనేశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె తమ స్వగ్రామమైన కృష్ణాజిల్లా పామర్రు మండలం నిమ్మకూరులో ఉన్న గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. తన తండ్రి ఎన్‌టిఆర్ నిమ్మకూరులో చదువుకుంటూ, ఆయన తండ్రికి వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తూ, పాలు అమ్ముకుంటూ కష్టపడి ఉన్నత స్థితికి వచ్చారని అన్నారు. అనంతరం గ్రామంలోని ఎన్‌టిఆర్ దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆరు కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్న పనులకు ఆమె భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర గనుల శాఖ మంత్రి, మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ బాలాజీ, ఆర్‌టిసి ఛైర్మన్ కొనగళ్ల నారాయణ, జిల్లా టిడిపి నూతన అధ్యక్షుడు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ ఛైర్మన్ వేరంకి గురుమూర్తి, స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు.

గిరిజనులపై అక్రమ కేసులను తొలగించండి

- ఎపి వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా, బుట్టాయి గూడెం మండలం, ఇనుమూరులో గిరిజనుల పంటలను ధ్వంసం చేయడమే కాకుండా గిరిజనులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక, రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు తీవ్రంగా ఖండించాయి. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, మరో 19 మంది గిరిజనులపై 8 సెక్షన్ల కింద అక్రమ కేసులు నమోదు చేసినట్లు ఆ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి వెంకటేశ్వర్లు, కె ప్రభాకర్‌రెడ్డి, ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల కిందట బుట్టాయిగూడెం ఎస్ఐ, తహశీల్దారు కొంత మంది అల్లరి మూకల్ని వెంటేసుకొని మూడు తరాలుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న 7 ఎకరాల భూమిలో ఉన్న మొక్కజొన్న పంటను ట్రాక్టర్లతో దున్ని ధ్వంసం చేశారన్నారు. ఈ చర్యను అడ్డుకున్న గిరిజన మహిళలను మగ పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ అక్కడి నుంచి పక్కకు తోసేశారన్నారు. ఈ క్రమంలో ఒక గిరిజన యువకుడి తలకు గాయం చేసినట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా ఆ ఊరు, ఆ మండలం కాని గిరిజనేతర అగ్రవర్ణ భూస్వాములకు 7 ఎకరాల భూమిని కట్టబెట్టడానికి గత కొన్ని రోజులుగా ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. గిరిజనులు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నా, కోర్టు ఆదేశాలను ధిక్కరించి, గత రెండు రోజుల కిందట పోలంలో ఎవరూ లేని సమయంలో మొక్కజొన్న పంటలను ధ్వంసం చేసి గిరిజనులను భయభ్రాంతులను చేశారన్నారు. భూమిని, పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నించిన గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆ భూములను గిరిజనులు సాగు చేసుకోవడానికి అభ్యంతరాలు పెట్టరాదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారణమైన ఎస్ఐ, తహశీల్దారును సస్పెండ్ చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నైజీరియాపై అమెరికా భీకర దాడులు

- ఐసిస్ లక్ష్యంగా జరిపినట్లు ట్రంప్ వెల్లడి

వాషింగ్టన్ : నైజీరియాపై అమెరికా భీకర దాడులకు దిగింది. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులే లక్ష్యంగా ఈ దాడులు ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. నైజీరియాలో క్రైస్తవులపై జరుగుతున్న హింసకు బదులుగానే ఈ దాడులు చేస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పోస్టు పెట్టారు. "నైజీరియాలో ఐసిస్ ఉగ్రవాదులపై అమెరికా శక్తిమంతమైన దాడులు ప్రారంభించింది. ప్రధానంగా అమాయకులైన క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని దారుణ హత్యలకుకు పాల్పడుతున్న వారిపై ఇవి జరిగాయి. ఈ ఊచకోతలు ఆపకపోతే నరకం చూపిస్తానని గతంలోనే హెచ్చరించా. నా హెచ్చరికలను వారు పట్టించుకోలేదు. ఇప్పుడు అనుభవిస్తున్నారు. రాడికల్ ఇస్లామిక్ ఉగ్రవాదాన్ని సహించను" అని పేర్కొన్నారు.

అలాగే, ఈ సందర్భగా చనిపోయిన ఉగ్రవాదులతో సహా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతున్నట్లు ట్రంప్ తెలిపారు. క్రైస్తువులపై హత్యాకాండ కొనసాగితే.. తమ దాడులు కూడా జరుగుతూనే ఉంటాయని హెచ్చరించారు. నైజీరియా అధికారుల అభ్యర్థన మేరకు దాడులు చేసి.. పలువురు ఉగ్రవాదులను అంతం చేశామని అమెరికాకు చెందిన సైన్యాధికారి పేర్కొన్నారు.

నైజీరియా ఐసిస్ అనుబంధ సంస్థలు, బోకో హరామ్ అనే తీవ్రవాదుల నుంచి ముప్పు ఎదుర్కొంటోంది. 2020లో అమెరికా తొలిసారిగా నైజీరియాను ప్రత్యేక ఆందోళనకర దేశాల జాబితాలో పేర్కొంది. క్రైస్తవులపై జరుగుతున్న హింసను అరికట్టడానికి నైజీరియాలో సైనిక చర్యలకు ప్రణాళిక రూపొందించాలని పెంటగాన్‌ను ఆదేశించినట్లు నవంబరులో ట్రంప్ పేర్కొన్నారు.

ఈ క్రమంలోనే తాజా దాడులు జరిగాయి. నైజీరియాలోని మసీదు వద్ద జరిగిన బాంబు పేలుడులో ఐదుగురు మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. ఈ పేలుడులో 35 మంది గాయపడ్డారు. నైజీరియాలోని ఈశాన్య మైదుగురిలో ఉన్న ఓ మసీదు వద్ద ఈ బాంబు పేలుడు చోటుచేసుకుంది. రాత్రి మసీదులో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో బాంబు పేలుడు సంభవించినట్లు అధికారులు వెల్లడించారు.

తొలిరోజే 20 వికెట్లు

- ఆస్ట్రేలియా 152/10, ఇంగ్లండ్ 110/10
- బాక్సింగ్ డే టెస్ట్‌కు 94,119 ప్రేక్షకులు హాజరు



మెల్‌బోర్న్: బాక్సింగ్ డే టెస్ట్ ప్రారంభమైన తొలిరోజే 20 వికెట్లు నేలకూలాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ రెండుజట్లూ తొలిరోజే తమ తమ తొలి ఇన్నింగ్స్‌ను ముగించాయి. ఆసీస్ జట్టు 46 ఓవర్లలో 152పరుగులకు, ఇంగ్లండ్ జట్టు 30ఓవర్లలోపు 110 పరుగులకు ఆలౌటయ్యాయి. అలాగే బాక్సింగ్ డే టెస్ట్‌ను చూసేందుఉ రికార్డుస్థాయిలో 94,119 ప్రేక్షకులు హాజరయ్యారు. ఇది టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డుగా నమోదైంది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టులో ఇవి చోటు చేసుకున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాను ఇంగ్లండ్ బౌలర్ జోష్ టాంగ్ దెబ్బతీశాడు. అతను 45పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఆసీస్ క్రమంగా వికెట్లను కోల్పోయింది. ఏ ఒక్క బ్యాటరూ అర్ధసెంచరీ చేయలేదు. మైఖేల్ నెసెర్ చేసి 35 పరుగులే అత్యధికం. ఇంగ్లండ్ బౌలర్లు అట్కిన్సన్‌కు రెండు, కర్సే, స్టోక్స్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం ఇంగ్లండ్ కూడా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో దారుణంగా విఫలమైంది. ఇప్పటికే సిరీస్ కోల్పోయిన ఆ జట్టు మెల్‌బోర్న్ పిచ్‌పై ఏమాత్రం నిలవలేకపోయింది. ఆసీస్ పేస్ బౌలర్ల దాడికి మళ్లీ చేతులెత్తేసింది. ఇంగ్లండ్ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ ఒక్కడే రాణించాడు. అతను అత్యధికంగా 41 రన్స్ స్కోరు చేశాడు. చివరలో అట్కిన్సన్ కొన్ని మెరుపులు మెరిపించాడు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నెసెర్‌కు నాలుగు, బోలాండ్‌కు మూడు, స్టార్క్ రెండు వికెట్లు దక్కాయి. దీంతో ఆసీస్ జట్టుకు 42పరుగుల కీలక ఆధిక్యత లభించగా.. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4పరుగులు చేసింది.

94,199మంది ప్రేక్షకులు..

మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్(ఎంసిజి) తన రికార్డు తానే బద్దలుకొట్టింది. యాషెస్ సిరీస్ 2025లో భాగంగా ఈ గ్రౌండ్‌లో శుక్రవారం బాక్సింగ్ డే టెస్టు ప్రారంభం కాగా.. ఈ మ్యాచ్‌ను వీక్షించడానికి తొలిరోజు రికార్డుస్థాయిలో ప్రేక్షకులు తరలివచ్చారు. ఒక టెస్ట్, ఒకరోజు వీక్షించడానికి ఏకంగా 94,199 మంది క్రికెట్ అభిమానులు తరలివచ్చినట్లు సమాచారం. రికార్డుస్థాయిలో అభిమానులు గ్రౌండ్‌కు తరలిరావడంతో స్టాండ్స్ అన్నీ ప్రేక్షకులతో కిక్కిరిసిపోయాయి. తొలుత ఈ మ్యాచ్‌కు 93,442 మంది ప్రేక్షకులు వచ్చినట్లు ఎంసిజి గ్రౌండ్ ఎక్స్ ఖాతాలో ప్రకటించింది. ఆ తర్వాత గంట వ్యవధిలోనే మరో దాదాపు వెయ్యి మంది అభిమానులు పెరిగినట్లు ప్రకటించింది. 2013లో ఇంగ్లండ్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్ట్‌కు 91,112మంది ప్రేక్షకులు హాజరుకాగా.. ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ జట్ల మధ్య 2015లో జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు 93,013మంది ప్రేక్షకులు హాజరయ్యారు. తాజాగా ఆ రెండు రికార్డులను తుడిచిపెట్టుకుపోయాయి.



శ్రీనివాస మంగాపురం తొలి షెడ్యూల్ పూర్తి



ఘట్టమనేని జయకృష్ణ, రాషా తడాని జోడీగా తెరకెక్కుతున్న సినిమా 'శ్రీనివాస మంగాపురం'. తొలి షెడ్యూల్ ఇటీవలే పూర్తయ్యింది. ఆర్ఎక్స్ 100, మంగళవారం లాంటి సినిమాలను తీసిన అజయ్ భూపతి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. లవ్ అండ్ మిస్టరీ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రాన్ని చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. అశ్వనీదత్ సమర్పిస్తున్నారు. జీవీ ప్రకాష్ సంగీతం. ఈ మూవీ నుంచి అప్డేట్ రాబోతుందంటూ డైరెక్టర్ అజయ్ భూపతి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'ప్రేమతో రాసి, అందంతో ముసాయిదా చేయబడింది..మొదటి షెడ్యూల్‌కి ముగింపు.. శ్రీనివాస మంగాపురం ఫస్ట్ లుక్ త్వరలో విడుదల కానుంది.. ఉత్సాహంగా ఉండండి' అంటూ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది.



ఒకరి చేతిలోనే సినిమా ఇండస్ట్రీ : ప్రసన్నకుమార్

'ఇండస్ట్రీ మొత్తం ఒక్కరి చేతుల్లోనే ఉంది. చిన్న నిర్మాతలకు థియేటర్లు ఇవ్వడం లేదు. బెనిఫిట్ షోలు కూడా చిన్న సినిమాలకు అందడం లేదు. సిఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారు. మా సమస్యలు పరిష్కరిస్తే ఎన్నికల నుంచి విత్ డ్రా చేసుకోవటానికి కూడా సిద్ధమే. పెద్ద నిర్మాతలు లేబర్ కమిషనర్ వద్దకు వెళ్లడం దారుణం. చిన్న నిర్మాతలు సొంత డబ్బుతో నామినేషన్లు వేశాం. పెద్దలకు అవకాశం ఇచ్చినా ఏమీ చేయలేదు. చివరకు మెడిక్లెయిమ్ చేయిస్తామని చెప్పి అది కూడా చేయలేదు. ఈసారి చిన్న నిర్మాతలకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాం' అని నిర్మాత ప్రసన్నకుమార్ అన్నారు. ఈనెల 28న తెలుగు ఫిలిం చాంబర్ కామర్స్ పాలకవర్గ ఎన్నికలు జరగనున్నాయి. ప్రొడ్యూసర్స్, ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్, స్టూడియో ఓనర్స్ విభాగాల నుంచి అభ్యర్థులు పోటీపడుతున్నారు.



షగ్న శ్రీ వేణున్ నటిస్తూ, దర్శకత్వంలో ....

కథానాయిక షగ్న శ్రీ వేణున్ మెగా ఫోన్ పట్టారు. ఆమె కథానాయికగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఓ సినిమా షూటింగ్ గత కొన్ని రోజులుగా కొనసాగుతోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాల సినిమాతో ఆమె కథానాయికగా ప్రస్థానం ప్రారంభమైంది. ప్రస్తుతం తీసే సినిమాలో వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్నారు. ఎస్ 2ఎస్ సినిమాస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నం.2 ఈ సినిమా తెరకెక్కుతోంది. మూవీ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఒక బ్లాక్ డ్రెస్ ధరించిన యువ జంట చేతిలో రోజా పూలతో ఉండటం, మరో యువకుడు ఈ జంటలోని యువతి చేయి పట్టుకుని ఉన్నట్లుగా కనిపిస్తుంది. షఉటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాను వచ్చే మార్చిలో థియేటర్లలో విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు.

అసత్య ప్రచారం చేయొద్దు

'దయచేసి చిన్న సినిమాలను చంపకండి. సినిమానే నమ్ముకున్న వందలాది కుటుంబాలను రోడ్డున పడేయకండి. మా 'ఈషా' సినిమా విడుదలకు ముందు రోజు చాలా చోట్ల ప్రీమియర్ షోలు వేశాం. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఆన్లైన్‌లో టికెట్ల బుకింగ్ కూడా ఆశాజనకంగానే ఉంది. అయితే సోషల్ మీడియాలో 'ఈషా' సినిమాపై జరుగుతోన్న వ్యతిరేక ప్రచారం మమ్మల్ని అసంతృప్తికి గురిచేస్తోంది. కొంత మంది కావాలని ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్ ఫామ్లో ఫేక్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఇలా చేయడం సరికాదు. సినిమా బాగుంటే ప్రేక్షకులు చూస్తారు. లేదంటే వదిలేస్తారు. అసత్య ప్రచారం చేసేది ఎవ్వరో త్వరలోనే గుర్తిస్తాం. ఎవ్వరినీ వదిలిపెట్టే ప్రసక్తేలేదు' అని దర్శకుడు కెఎల్ దామోదర ప్రసాద్ అన్నారు. కెఎల్ దామోదరప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు 'ఈషా' సినిమాను నిర్మించారు. వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ సినిమాను శుక్రవారం విడుదల చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ట్రోలింగ్‌పై దామోదర ప్రసాద్, బన్నీ వాసు, వంశీ నందిపాటి స్పందించారు.




ఇయర్ ఎండ్ ఓటీటీ సినిమాలు ఇవే...

మరో 5 రోజుల్లో కొత్త ఏడాది రాబోతుండగా.. ఈ వారం టాలీవుడ్ బాక్సాఫీస్ కళకళలాడుతోంది. ఛాంపియన్, దండోరా, ఈషా, శంబాల వంటి చిన్న సినిమాలు బాక్సాఫీసు వద్ద సందడి చేస్తున్నాయి. ఓ వైపు థియేటర్లలో చిన్న సినిమాలు అలరిస్తుంటే.ఓటీటీలో కూడా క్రేజీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు ప్రేక్షకుల ముందుకొచ్చాయి.

నెట్‌ఫ్లిక్స్

ఆంధ్ర కింగ్ తాలూకా (సినిమా)-తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం
రివాల్వర్ రీటా (సినిమా)-తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం
స్ట్రేంజర్ థింగ్స్ : సీజన్ 5 (వాల్యూ 2)-ఇంగ్లీష్, తెలుగు, తమిళం, హిందీ
ఈడెన్-ఇంగ్లీష్
క్యాష్ హీరో-కొరియన్, తెలుగు, తమిళం, హిందీ
గుడ్ బై జూన్ -ఇంగ్లీష్
'బాహుబలి: ది ఎపిక్' -హిందీ
పోస్ట్ హౌస్ (మూవీ) ఇంగ్లీష్



ప్యారడైజ్ (మూవీ) ఇంగ్లీష్
కవర్ అప్ (మూవీ) ఇంగ్లీష్
ది త్రీసమ్ (మూవీ) ఇంగ్లీష్
ఎకో (సినిమా) (డిసెంబర్ 31 నుంచి) తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం

అమెజాన్ ప్రైమ్

టుగెదర్ (సినిమా)-ఇంగ్లీష్, తెలుగు, తమిళం, హిందీ
రజిని గ్యాంగ్ (సినిమా) -తమిళం
ఫ్యాకమ్ హాల్ -ఇంగ్లీష్ (రెంట్)
సూపర్ నేచురల్ (వెబ్‌సిరీస్) -ఇంగ్లీష్
100 నైట్స్ ఆఫ్ హీరో (మూవీ) ఇంగ్లీష్
ఫైవ్ నైట్స్ ఎట్ ఫ్రెడ్డీస్ 2 (మూవీ) ఇంగ్లీష్
న్యూరెంబర్గ్ (మూవీ) ఇంగ్లీష్

జియో హాట్‌స్టార్

అమెడియస్ -ఇంగ్లీష్
నోబడీ 2 -ఇంగ్లీష్, హిందీ
ద కోపెన్‌హాగన్ టెస్ట్ (సిరీస్) -ఇంగ్లీష్
హ్యాపీ అండ్ యూ నో ఇట్ (మూవీ) ఇంగ్లీష్

జీ5

ఏక్ దివానే కీ దివానియత్ (మూవీ) హిందీ
మిడిల్ క్లాస్ (మూవీ)-తమిళ్
అహా వీడియో
లయన్స్ గేట్ ప్లే
స్నిచ్ -ఇంగ్లీష్, హిందీ

ప్రజాశక్తి
www.prajasakti.com

ఢిల్లీ హైకోర్టు తీర్పుపై సుప్రీంకు సిబిఐ

న్యూఢిల్లీ : ఉన్నావో లైంగికదాడి కేసులో బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్‌కు ఢిల్లీ హైకోర్టు జైలు శిక్షను నిలిపివేయడం, బెయిల్ మంజూరు చేయడానికి వ్యతిరేకంగా సిబిఐ శుక్రవారం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పి) దాఖలు చేసింది. ఢిల్లీ హైకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా గురువారం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసిన ఒకరోజు తరవాత సిబిఐ ఈ పిటిషన్ వేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాలను అధ్యయనం చేసిన తరువాత ఎస్‌-ఎల్‌పి దాఖలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సిబిఐ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. సెంగార్‌కు జైలుశిక్షను ఈ నెల 23న హైకోర్టు రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే దీనిపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద రాహుల్ నివాళి

మాజీ ప్రధాని మన్మోహన్‌కు కాంగ్రెస్ నివాళి

న్యూఢిల్లీ : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ తొలి వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయనకు కాంగ్రెస్ ఘనంగా నివాళులర్పించింది. పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇతర నాయకులు న్యూఢిల్లీలో నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఖర్గే సోషల్ మీడియాలో చేసిన పోస్టులో దేశ ఆర్థిక మార్గాన్ని మన్మోహన్ పునర్నిర్మించారని, ఆర్థిక సంస్కరణల ద్వారా లక్షలాది మందికి అవకాశాలను విస్తరించారని, లక్షలాది మందిని పేదరికం నుంచి బయటపడేశారని తెలిపారు. మన్మోహన్ వినయం, నిజాయితీ, వారసత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని చెప్పారు. రాహుల్‌గాంధీ తన పోస్టులో 'మన్మోహన్ తన దార్శనిక నాయకత్వం ద్వారా భారత్‌ను ఆర్థికంగా శక్తివంతం చేశారు. ఆయన చారిత్రాత్మక ప్రయత్నాలు, పేదల కోసం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలు ప్రపంచ వేదికపై భారత్‌కు కొత్త గుర్తింపును ఇచ్చాయి' అని తెలిపారు. ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా తన పోస్టులో 'మన్మోహన్ సింగ్ సమానత్వాన్ని బలంగా విశ్వసించారు. ఆయన ఒక బలమైన, ధైర్యవంతుడైన, గౌరవనీయమైన వ్యక్తి. దేశ ప్రగతికి నిజంగా అంకితమైనవారు.

టొరంటో వర్శిటీ సమీపంలో భారత విద్యార్థి హత్య

టొరంటో : టొరంటో యూనివర్శిటీ కేంపస్‌కు సమీపంలో భారతీయ విద్యార్థిని మంగళవారం కాల్చిచంపారు. కాగా బాధితుడిని శివాంక్ అవస్థి (20)గా పోలీసులు బుధవారం గుర్తించారు. మంగళవారం రాత్రి 3.30గంటల ప్రాంతంలో నేలపై గాయపడిన వ్యక్తి ఒకరు పడి వున్నట్లు పోలీసులకు సమాచారం అందింది, వెంటనే అక్కడకు వెళ్ళి చూడగా తపాకీ కాల్పులతో ఒక వ్యక్తి పడిపోయాడని, ఆ వ్యక్తి అక్కడనే మరణించాడని ధృవీకరించినట్లు డ్యూటీ ఇనస్పెక్టర్ జెఫ్ అలింగ్టన్ విలేకర్లకు తెలిపారు. అసలు ఏం జరిగిందో తెలుసుకోవడం, వారి కుటుంబానికి సమాచారం తెలియచేయడంపై తాము తక్షణం దృష్టి కేంద్రీకరించామని చెప్పారు. అక్కడ అనుమానాస్పదంగా ఏమీ కనిపించలేదని, పైగా నిందితుడు కూడా పారిపోయాడని పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

'ఉన్నావో' దుండగుడికి బెయిల్ రద్దు చేయాలి

- సెంగార్‌కు జీవితఖైదు కొనసాగించాలి
- ఢిల్లీ హైకోర్టు వద్ద ఐద్వా ఆందోళన

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఉన్నావో లైంగికదాడి కేసులో నిందితుడు, బిజెపి ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్ బెయిల్ రద్దు చేయాలని, ఆయన జీవిత ఖైదు కొనసాగించాలని ఐద్వా డిమాండ్ చేసింది. కుల్దీప్‌కు విధించిన జైలు శిక్షను ఢిల్లీ హైకోర్టు నిలిపివేయడం, షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడానికి వ్యతిరేకంగా శుక్రవారం ఢిల్లీ హైకోర్టు ఎదుట అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేపట్టారు. 'బలత్కారియో కో సంరక్షన్ బంద్ కరో (అత్యాచారాల దుండగులను రక్షించడం ఆపండి)' అంటూ నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే మాట్లాడుతూ నేరస్తుడికి పదవి, కులం, మతం, ఎలాంటి పరిపాలన, రాజకీయ, న్యాయపరమైన రక్షణ కల్పించకూడదని డిమాండ్ చేశారు. కుల్దీప్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మైనర్‌ను ఇంటికి పిలిపించుకుని, స్పృహ లేకుండా చేసి..ఆపై లైంగికదాడికి పాల్పడడం హేయమైన చర్యని, ఈ ఘటన అనంతరం విషయాన్ని బయటకు చెప్పవద్దంటూ బాలికపై బెదిరింపులకు సైతం పాల్పడ్డాడని విమర్శించారు. అయినా బాలిక ధైర్యంగా ఫిర్యాదు చేయబోతే పోలీసులు ఎఫ్‌ఐఆర్ కూడా నమోదు చేయడానికి భయపడ్డారని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి ఇంటి ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళనకు దిగితే తప్ప ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని దుయ్యబట్టారు. అనంతరం ఎఫ్‌ఐఆర్ ఉపసంహరించుకోవాలని నిరంతరం బెదిరింపులకు పాల్పడుతూ బాధిత కుటుంబంపై ఒత్తిడి తీసుకురావడమే కాకుండా, ఆమె తండ్రిని కస్టడీలోకి తీసుకుని హత్య చేశారన్నారు. తరువాత కూడా కుటుంబంపై దాడి చేశారని, ఆ సమయంలో మైనర్ అత్త, పిన్ని మరణించారని తెలిపారు. చివరికి నిందితునికి జీవిత ఖైదు శిక్ష పడిందన్నారు. ఇప్పటికీ బిజెపి నేతల బెదిరింపులు ఆగలేదన్నారు. సంఘ్ పరివార్ నాయకులు వారి ప్రతి వాహనం వెనుక 'బేటీ బచావో, బేటీ పడావో' అనే నినాదాన్ని అతికిస్తున్నారని, కానీ ఆచరించడం లేదని, వాస్తవానికి అమ్మాయిల పట్ల వాళ్లే పెనుముప్పుగా పరిణమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మనువాద పాలనలో కోర్టు నుంచి న్యాయం ఆశించడం కష్టమవుతోందన్నారు.



ఢిల్లీ హైకోర్టు వద్ద ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు మరియం దావలే తదితరులు

బాధితురాలి తల్లి మాట్లాడుతూ ఘటన అనంతరం తన కుమార్తె అనేక బాధలు అనుభవించిందని గుర్తు చేసుకున్నారు. న్యాయం కోసం నిరసన తెలిపేందుకే కోర్టుకు వచ్చామన్నారు. గతంలో చేసిన న్యాయాన్ని మార్చి ఇచ్చిన తాజా తీర్పు తీవ్ర ఆవేదన కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ, ఇప్పటికీ న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని, అందుకే సుప్రీంకోర్టుకు వెళతామని స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సామాజిక కార్యకర్త యోగితా భయాన, ఐద్వా ఢిల్లీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశాయాదవ్, కవిత శర్మ, నేతలు ఆశా శర్మ, శర్బానీ సర్కార్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడుల పట్ల భారత్ ఆందోళన

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో అడ్డూ అదుపు లేకుండా మైనారిటీలపై కొనసాగుతున్న దాడులు, హింస, అల్లర్లు తీవ్ర ఆందోళన కలిగించే అంశమని భారత్ శుక్రవారం వ్యాఖ్యానించింది. ఆ దేశంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరగాలన్న తన వైఖరిని పునరుద్ఘాటించింది. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహమాన్ స్వదేశానికి రావడంపై కూడా భారత్ ఆచితూచి ప్రతిస్పందించింది. రాబోయే ఎన్నికల్లో అందరినీ కలుపుకుని వెళ్ళాలన్న నేపథ్యంలో దీన్ని చూడాలని వ్యాఖ్యానించింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, ఇటీవల బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్‌లో హత్యకు గురైన హిందూ యువకుడు దీపూ చంద్రదాస్ హత్యను భారత్ ఖండిస్తోందని చెప్పారు. హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు సహా బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దాడులు తీవ్రంగా ఆందోళన కలిగించే అంశమని పేర్కొంటూ ఇటువంటి దాడులకు, నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జైస్వాల్ మీడియా సమావేశంలో చెప్పారు. బంగ్లాదేశ్‌లో పరిణామాలను భారత్ నిశితంగా పరిశీలిస్తోందన్నారు. తాత్కాలిక ప్రభుత్వ హయంలో మైనారిటీలపై 2900కిపైగా హింసాత్మక సంఘటనలు జరిగాయని, వాటిని స్వతంత్ర వర్గాలు డాక్యుమెంట్ చేశాయని ఆయన తెలిపారు. అక్కడి దాడులను కేవలం మీడియా అత్యుత్సాహంగా లేదా రాజకీయ హింసగా కొట్టిపారేయలేమని జైస్వాల్ వ్యాఖ్యానించారు.



రణధీర్ జైస్వాల్

ఒడిషాలో వలస కార్మికుడి హత్యను ఖండించిన సిడబ్ల్యూఎఫ్‌ఐ

న్యూఢిల్లీ : ఒడిషాలో బెంగాల్‌కు చెందిన వలస కార్మికుడిపై మూక దాడి, దారుణ హత్య ఘటనపై భారత నిర్మాణరంగ కార్మికుల సమాఖ్య (సిడబ్ల్యూఎఫ్‌ఐ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ భయానక ఘటనను తక్కువ చేసి చూపించడానికి అధికారులు చేసే ఏ ప్రయత్నాన్నైనా నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్నట్లు తెలిపింది. మూకదాడికి తెగబడిన వారు బాధితుల గుర్తింపును విచారించారని, ఆధార్ కార్డులు చూపించాలని బలవంతం చేశారని తెలిపింది. బాధితుల్ని 'బంగ్లాదేశ్ చొరబాటుదారులు'గా ముద్ర వేశారని విమర్శించింది. ఈ ఘటన బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న విద్వేషపూరిత ప్రచారానికి ప్రత్యక్ష ఫలితమని పేర్కొంది. బిజెపి తన రాజకీయ లాభం కోసం బెంగాలీ మాట్లాడే వలసకార్మికులను 'విదేశీ అక్రమ వలసదారులు'గా ప్రచారం చేస్తుందని, ఇది కార్మికులపై మూకదాడులకు వాతావరణం సృష్టించిందని విమర్శించింది. కార్మిక వర్గ భద్రతకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని సిడబ్ల్యూఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. ఈ కేసులో ఆరుగుర్ని అరెస్టు చేసినా, నిందితులకు సాధ్యమైనంత కఠినమైన శిక్షను నిర్ధారించడానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టును డిమాండ్ చేసింది. అలాగే, మృతుడి కుటుంబానికి రూ.కోటి, గాయపడినవారికి రూ.25 లక్షలు తక్షణ పరిహారం అందించాలని ఒడిషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వలసకార్మికులను రక్షించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరింది. అలాగే, ఈ దాడిలో మరణించిన జుయెల్ షేక్ కుటుంబానికి సంఘీభావాన్ని సిడబ్ల్యూఎఫ్‌ఐ ప్రకటించింది. ఈ అనాగరిక హత్యను ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని తన అనుబంధ సంస్థలకు సిడబ్ల్యూఎఫ్‌ఐ పిలుపునిచ్చింది.



మూకదాడిలో మృతిచెందిన జుయెల్ షేక్ ఇన్‌సెట్‌లో, రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అమెరికా రక్షణ సంస్థలపై చైనా ఆంక్షలు

- తైవాన్‌పై కవ్వింపు చర్యలు వద్దు అని హితవు

బీజింగ్ : అమెరికాకు చెందిన 20 రక్షణ సంస్థలపై చైనా శుక్రవారం ఆంక్షలు విధించింది. తైవాన్‌కు 11.1 బిలియన్ల డాలర్ల విలువైన ఆయుధాల అమ్మకాల ప్యాకేజీకి ట్రంప్ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసినందుకు ప్రతిగా చైనా ఈ చర్య తీసుకుంది. తైవాన్ అంశంపై చైనాను రెచ్చగొట్టే ఏ ప్రయత్నానికైనా తీవ్ర ప్రతిస్పందన వుంటుందని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో హెచ్చరించింది.

అమెరికా తీసుకున్న చర్యను ఖండిస్తూ అమెరికా మిలటరీకి చెందిన 20 సంస్థలపై, 10మంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లపై చర్యలు తీసుకోవాలని బీజింగ్ నిర్ణయించింది. ఇటీవల కాలంలో తైవాన్‌కు ఆయుధాలు అందచేసే ప్రక్రియలో వీరందరి పాత్ర వుందని చైనా భావిస్తోంది.



తైవాన్‌కు సంబంధించిన చైనా కీలక ప్రయోజనాలను అమెరికా ఎన్నడూ ఉల్లంఘించరాదని, ఇది చైనా-అమెరికా సంబంధాల్లో మొదటి లక్ష్మణరేఖ అని ఆ ప్రకటన పేర్కొంది. ఎవరైనా ఈ రేఖను ఉల్లంఘించాలని భావించినా, లేదా తైవాన్‌పై రెచ్చగొట్టే చర్యలకు దిగినా చైనా కచ్చితంగా దీటుగా స్పందిస్తుందని ఆ ప్రకటన పేర్కొంది.

ఒకే చైనా అన్న సూత్రానికి అమెరికా కట్టుబడాలని కోరింది. తైవాన్‌కు ఆయుధాలు అందచేసే ప్రమాదకరమైన చర్యలను నిలిపివేయాలని పేర్కొంది. తైవాన్ జలసంధిలో శాంతి సుస్థిరతలకు భంగం కలిగించరాదని స్పష్టం చేసింది. తైవాన్ వేర్పాటువాద శక్తులకు తప్పుడు సంకేతాలు పంపరాదని పేర్కొంది. దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతను, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంది.



బాల పురస్కారాలు అందుకున్న చిన్నారులతో రాష్ట్రపతి ముర్ము

20 మంది చిన్నారులకు ప్రధానమంత్రి బాల పురస్కారం

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందజేత
- అన్నమయ్య జిల్లాకు చెందిన శివానికి దక్కిన గౌరవం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఆవిష్కరణలు, శాస్త్ర, సాంకేతిక, క్రీడా రంగాల్లో ప్రతిభ చాటిన 20 మంది చిన్నారులకు 2025 ఏడాదికి గాను 'ప్రధానమంత్రి బాల పురస్కారం' లభించింది. ఈ పురస్కారాలను న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారి విజేతలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. అన్నమయ్య జిల్లాకు చెందిన శివాని హోసురు ఉప్పర క్రీడా విభాగంలో పురస్కారం అందుకున్నారు. వికలాంగురాలైన ఆమె పారా అథ్లెట్లు, షాట్‌పుట్, జావెలిన్ త్రోలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడల్లో ఎనిమిది పైగా పతకాలు సాధించారు. అలాగే తెలంగాణలోని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన విశ్వనాథ్ కార్తికే పడకంటి కూడా క్రీడా విభాగంలో బాల పురస్కారం అందుకున్నారు. పర్వతాధిరోహణలో విశ్వనాథ్ కనబర్చిన ప్రతిభకు ఈ పురస్కారం అందజేశారు.

విద్యుతాఘాతానికి గురైన ఓ బాలుడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన ఎనిమిదేళ్ల చిన్నారి వ్యోమ ప్రియ (కోయంబత్తూరు, తమిళనాడు) తరపున ఆమె తల్లి అర్చనా శివరామకృష్ణన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కుమార్తెను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. నదిలో ఈత కొడుతున్న సమయంలో తోటి స్నేహితుడిని కాపాడే సమయంలో తన ప్రాణాలను విడిచిన బీహార్‌లోని కైమూర్ జిల్లాకు చెందిన కమలేశ్‌కుమార్, ఆపరేషన్ సిందూర్ సమయంలో సైనికులకు మంచినీరు, పాలు, టీ, లస్సీ వంటివి అందిస్తూ బాసటగా నిలిచిన పదేళ్ల బాలుడు శ్వాన్ సింగ్ (ఫిరోజ్‌పూర్, పంజాబ్) అవార్డును అందుకున్నారు. బీహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ, ఆగ్రాకు చెందిన అజయ్ రాజ్, మహారాష్ట్రకు చెందిన అరవ్ అనుప్రియ మహర్షి సహా మరికొంత మంది చిన్నారులు ఈ పురస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు.

దేశానికి స్ఫూర్తిదాయకం ..

చిన్నారులు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, వివిధ రంగాల్లో వారు చాటిన ప్రతిభ దేశానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్రపతి ద్రౌపది అన్నారు. పురస్కారాల అందజేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. పురస్కార విజేతలకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. చిన్నారుల ధైర్య సాహసాలు, విజ్ఞానం దేశానికి గర్వకారణమని ఆమె ప్రశంసించారు. బాలలు దేశభక్తి, ఉన్నత ఆదర్శాలతో నిండి ఉన్నప్పుడే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వానిది కీలక పాత్ర

- సిజెఐ సూర్యకాంత్ మిశ్రా



పనాజీ : ప్రస్తుత సమాజంలో వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తోందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మిశ్రా అన్నారు. 'మధ్యవర్తిత్వం' అనే అంశంపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దక్షిణ గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో శుక్రవారం జాతీయ సదస్సు, సింపోజియం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో సిజెఐ మాట్లాడారు. వ్యాజ్యాల విచారణ అనేది మరణానంతరం చేపట్టే శవ పరీక్ష లాంటిదయితే..మధ్యవర్తిత్వం అనేది ప్రాణాలను కాపాడే శస్త్ర చికిత్స వంటిదని ఆయన అభివర్ణించారు. న్యాయస్థానాలు విచారణకు మాత్రమే పరిమితం కాకుండా సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపే విధంగా బహురూప న్యాయ పరిష్కార వేదికలు (మల్టీ డోర్ కోర్టు హౌస్) గా మారాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు పెరిగిపోతున్నాయని, వాటిని మధ్యవర్తిత్వం ద్వారా తగ్గించవచ్చన్నారు. ఇది చట్టం బలహీనత కాదని, అత్యున్నత పరిణామం అని అన్నారు. న్యాయం కోసం వచ్చే వ్యక్తికి వారి ఫిర్యాదు నిర్దిష్టత ఆధారంగా పరిష్కార మార్గాలుండాలన్నారు. అందుకు మధ్యవర్తిత్వం (మీడియేషన్), ఆర్బిట్రేషన్, వ్యాజ్యం అనే ద్వారాలు ఉండాలని వివరించారు. ఈ న్యాయ ప్రక్రియలన్నిటిలోనూ విజయవంతమవ్వాలంటే మధ్యవర్తికి ప్రాంతీయ భాషలతోపాటు వాటి మాండలికాలు, ఆ ప్రాంత సంస్కృతి కూడా తెలిసుండాలని ఆయన అన్నారు. ప్రస్తుతం 39 వేల మంది మధ్యవర్తులు ఉన్నారన్నారు. కాని 2.5 లక్షల మంది అవసరమని తెలిపారు. దీనికోసం 'దేశం కోసం మధ్యవర్తిత్వం' అనే ప్రచార కార్యక్రమాన్ని ఈ ఏడాది జులైలో ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ పిఎస్ నరసింహా, జస్టిస్ అహ్‌సానుద్దీన్ అమనుల్లా, జస్టిస్ ఎన్ కోటీశ్వర సింగ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ డేటాతో స్కిల్ ఇండియా

లేని యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చినట్టు రికార్డులు - దారితప్పిన కోట్లరూపాయల నిధులు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటున్న స్కిల్ ఇండియా'లో భాగమైన ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) దేశ యువతకు నైపుణ్యాలు, ఉద్యోగాలు అందించడంలో తీవ్రంగా విఫలమైందని కాగ్ తాజా నివేదిక వెల్లడించింది. పీఎంకేవీవై కింద నమోదైన కోట్లాది మంది లబ్ధిదారుల బ్యాంక్ ఖాతా వివరాలు, ఈమెయిల్ ఐడీలు, ఫోన్ నంబర్లు నకిలీగా ఉన్నాయనీ, ఒకే ఫొటోను వేర్వేరు రాష్ట్రాల్లో ఉపయోగించి వేల సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ చేసినట్టు కాగ్ ఆడిట్‌లో గుర్తించింది. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మంత్రిత్వ శాఖ, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎస్‌డీసీ)ల్లో ఆడిట్ నిర్వహిస్తున్న 'కాగ్'కు అక్కడ ఈ అవినీతికి సంబంధించిన 'క్లూ' దొరికింది. దాన్ని ఛేదించేందుకు అసోం, బీహార్, జార్ఖండ్, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్తాన్, యూపీ రాష్ట్రాల్లో సర్వేలు చేసింది. దీనిలో దేశ ప్రజలు విస్తుపోయే అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

1 కోటి 10 లక్షల మందికి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చినట్టు సర్టిఫికెట్లు

కేంద్రంలోని మోడీ సర్కారు 2015లో పీఎంకేవీవైను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా దేశ యువతను పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్దుతామని సర్కారు ప్రకటించింది. ఇందులో భాగంగా 2015 నుంచి 2022 వరకు మూడు దశల్లో అమలైన ఈ పథకానికి-ప్రభుత్వం రూ.10,194 కోట్లను విడుదల చేసింది. అధికారిక లెక్కల ప్రకారం 1 కోటి 10 లక్షల మందికి స్కిల్ సర్టిఫికేషన్ ఇచ్చినట్టు పేర్కొంది. ఈ 'కీ'ని పట్టుకొని 'కాగ్' డొంకను కదిలించింది. దేశప్రజలు బిత్తరపోయే విషయాలు వెల్లడయ్యాయి.

నకిలీ బ్యాంకు ఖాతాలు

పీఎంకేవీవై 2.ఓ, 3.ఓ డేటాను కాగ్ ఆడిట్‌లో పరిశీలించినప్పుడు మొత్తం 95.90 లక్షల మంది లబ్ధిదారుల్లో 90.66 లక్షల మంది (అంటే 94.53 శాతం) బ్యాంక్ ఖాతా వివరాలు సున్నాలుగా, ఖాళీగా, 'నల్', 'ఎన్.ఏ' (నాట్ అప్లికెబుల్)గా నమోదైనట్టు గుర్తించారు. అనేక చోట్ల బ్యాంకు ఖాతా నెంబర్ల స్థానంలో '11111111', '123456' వంటివి నమోదు చేసినట్టు 'కాగ్' గమనించింది. సర్టిఫికేషన్ అనంతరం రూ.500 చొప్పున ప్రోత్సాహకాన్ని లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. కానీ అవేవీ జరగలేదని 'కాగ్' గుర్తించింది. ఇప్పుడు నిధులు ఎటు దారిమళ్లాయనే అంశంపై పరిశోధనను మొదలుపెట్టింది.

డొంక తిరుగుడు సమాధానం ఇచ్చిన కేంద్రం

ఏంటివన్నీ...అని 'కాగ్' పీఎంకేవీవై పథకాన్ని అమలు చేస్తున్న కేంద్ర నైపుణ్య శిక్షణాభివృద్ధి శాఖను ప్రశ్నించింది. దానితో పాటు దీనికి అనుబంధంగా ఉన్న శాఖల నుంచీ వివరణ కోరింది. ఆయా మంత్రిత్వ శాఖలు ఇచ్చిన వివరణపై కాగ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసింది. బ్యాంకు ఖాతా వివరాలు తప్పనిసరి కాదనీ, ఆధార్-సీడింగ్ ద్వారా డబ్బులు జమ అవుతాయని ప్రభుత్వం వివరణ ఇవ్వడం మరిన్ని అనుమానాలను లేవనెత్తింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించకపోవడంతో ఈ పథకం అమలులో పారదర్శకత, బాధ్యత రెండూ దెబ్బతిన్నాయని 'కాగ్' తన నివేదికలో పేర్కొంది.

'4.ఓ'లోనూ మారని పరిస్థితి

గతేడాది అక్టోబర్ వరకు ఉన్న పీఎంకేవీవై '4.ఓ' డేటాలో కూడా 2.72 లక్షల 'నల్' ఈమెయిల్స్, 3.08 లక్షల పునరావృత ఈమెయిల్ ఐడీలు ఉన్నట్టు కాగ్ ఆడిట్ గుర్తించింది. కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఐటీ నియంత్రణలు పూర్తిగా అమలులోకి రాలేదని స్పష్టం చేసింది.

ఒకే ఫోటోతో...

ఒకే ఫోటోను వేర్వేరు రాష్ట్రాల్లోని బ్యాచ్‌లకు ఉపయోగించడం 'కాగ్' ఆడిట్‌ను మరింత కలవరపెట్టింది. ఉదాహరణకు బీహార్‌లోని గయా జిల్లాలో ఒక బ్యాచ్‌కు ఉపయోగించిన ఫొటోనే.. యూపీలోని బహ్రైచ్ జిల్లాలో మరో బ్యాచ్‌కు ఉపయోగించినట్టు గుర్తించారు. ఇలాంటి ఫోటోల మాయాజాలం దాదాపు అన్ని జిల్లాల్లోనూ జరిగింది. దీనితో ఈ పథకం అమలులో తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన జరిగిందని 'కాగ్' నిర్ధారించింది.

శిక్షణా కేంద్రాలు, సంస్థలు మాయం

నీలిమా మూవింగ్ పిక్చర్స్ (ఎన్‌ఎంపీ) అనే సంస్థ ఎనిమిది రాష్ట్రాల్లో 33,493 మందికి సర్టిఫికేషన్లు ఇచ్చినట్టు రికార్డులున్నాయి. 'కాగ్' ఆడిట్ సమయానికి అసలు ఆ సంస్థే లేదు. బీహార్, ఒడిశా సహా పలు రాష్ట్రాల్లో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చిన శిక్షణా కేంద్రాలు, సంస్థలు మాయమయ్యాయి. కొన్ని మూసేసి ఉంటే, కొన్ని అసలు ఉనికిలోనే లేకుండా పోయాయి. ఈ విషయాలను కాగ్ తన ఆడిట్ నివేదికలో ప్రముఖంగా ప్రస్తావించడం గమనార్హం.

అన్నీ తప్పుడు లెక్కలే!

ఈ పథకం కింద సర్టిఫికేషన్ పొందిన 56.14 లక్షల మందిలో 23.18 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని కేంద్ర గణాంకాలు చెప్తున్నాయి. వాటి లెక్క తెలీకుండా ఉండేందుకు పూర్తి అసంఘటిత రంగంలోని ఐదు విభాగాల్లోనే ఈ ఉద్యోగాలు వచ్చినట్టు పేర్కొంది. ఆ లెక్కల ప్రకారం 31.70 లక్షల సర్టిఫికేషన్లలో (56.47 శాతం) 13.46 లక్షల ఉద్యోగాలు (58.08 శాతం) వస్త్రరంగంలోని 'సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్స్'లో జరిగాయని చూపించింది. మరో 19 సెక్టార్లలో 1.74 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ గణాంకాలకు మద్దతుగా కోవిడ్-19ను సాకుగా చూపినట్టు 'కాగ్' గుర్తించింది.

స్కిల్ ఇండియా పేరుతో మోడీ ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన అమలులో తీవ్రమైన నిర్లక్ష్యం, పారదర్శకత లోపం, ఫలితాల వైఫల్యం స్పష్టంగా బయటపడిందని కాగ్ నివేదిక తేల్చింది. యువత భవిష్యత్‌ను ప్రభావితం చేసే ఇలాంటి పథకాలపై కఠిన పర్యవేక్షణ, స్పష్టమైన బాధ్యత, సమగ్ర సంస్కరణలు అవసరమని ఈ నివేదిక హెచ్చరించింది. ఈ నివేదిక ఇప్పుడు మోడీ సర్కారును రాజకీయంగా ఇరుకున పెడుతుందని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.

ఉక్రెయిన్‌పై అమెరికాతో చర్చలు కొనసాగింపు

- రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ వెల్లడి

మాస్కో : రష్యా, అమెరికా అధికారులు ఫోన్‌లో మాట్లాడుకున్నారని, ఉక్రెయిన్‌పై తమ చర్చలను కొనసాగించేందుకు ఉభయ పక్షాలు అంగీకరించాయని క్రెమ్లిన్ శుక్రవారం ధృవీకరించింది. అమెరికా నుండి రష్యా ఆర్థిక దూత కిరిల్ దిమిత్రెవ్ తీసుకువచ్చిన పత్రాలను మాస్కో విశ్లేషించిన అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశాల మేరకు ఈ ఫోన్ సంభాషణ జరిగిందని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ విలేకర్లకు తెలిపారు.

ఈ ఫోన్ సంభాషణల్లో రష్యా అధ్యక్ష భవన సహాయకుడు యూరి యుష్‌కొవ్, పలువురు వైట్‌హౌస్ అధికారులు పాల్గొన్నారని పెస్కోవ్ తెలిపారు. అంతకుమించి వివరాలు వెల్లడించలేదు. గత ఆదివారం ఫ్లోరిడాలోని మియామిలో అమెరికా అధికారులతో సమావేశం జరిపిన అనంతరం దిమిత్రెవ్‌కు ఈ శాంతి ప్రణాళికను అందచేశారు. అనంతరం దిమిత్రెవ్ అందచేసిన ఉక్రెయిన్ శాంతి ప్రణాళికను మాస్కో విశ్లేషించిందని క్రెమ్లిన్ తొలుత వెల్లడించింది.

28న ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ



ఈ నెల 28న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అవుతానని, ఉక్రెయిన్‌కు ఇచ్చే భద్రతా హామీలపై ఇరువురం చర్చలు జరుపుతామని ఉక్రెయిన్ అధ్యక్షులు జెలెన్‌స్కీ తెలిపారు. చర్చించాల్సిన 20 సూత్రాల ప్రణాళిక దాదాపు 90శాతం సిద్ధమైందన్నారు. యుద్ధాన్ని ముగించే ప్రణాళికలో భాగంగా ఉక్రెయిన్ తూర్పు పారిశ్రామిక ప్రాంతం నుండి బలగాలను ఉపసంహరించుకోవడానికి తాను సుముఖంగా వున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా కూడా ఆ ప్రాంతం నుండి వెనక్కి మళ్ళాలని, దాన్ని నిస్సైనికీకరణ మండలంగా ప్రకటించాలని సూచించారు. శాంతి చర్చల్లో పురోగతి నెమ్మదిగా, నిలకడగా వుందని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జకరొవా గురువారం చెప్పారు.

ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గిస్తారా? లేదా?

- కేంద్రానికి 10 రోజుల గడువు విధించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : ఎయిర్ ప్యూరిఫైయర్ల ధరలు తగ్గించడంపై స్పష్టత ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఇందు కోసం కేంద్రానికి 10 రోజుల గడువు విధించింది. ఢిల్లీ, దేశరాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ఎయిర్ ప్యూరిఫైయర్లపై జిఎస్‌టి తగ్గించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం ఢిల్లీ హైకోర్టు విచారించింది. ఈ పిటిషన్‌పై 10 రోజుల్లోగా వివరణాత్మక అఫిడవిట్ సమర్పించాలని కేంద్రానికి జస్టిస్ వికాస్ మహాజన్, జస్టిస్ వినోద్ కుమార్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశించింది. తదుపరి విచారణ జనవరి 9కి వాయిదా వేసింది. ఎయిర్ ప్యూరిఫైయర్లను 'వైద్య పరికరాలు'గా వర్గీకరించాలని, జిఎస్‌టిను 5 శాతం స్లాబ్‌కు తగ్గించేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది కపిల్ మదన్ ఈ పిటిషన్ వేశారు. ప్రస్తుతం వీటిపై 18 శాతం పన్ను విధిస్తున్నారు. శుక్రవారం కేంద్రం తరపున విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్.వెంకటరామన్ వాదనలు వినిపిస్తూ ఈ నిర్ణయం తీసుకోవడానికి జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉందని, వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఇలాంటి సమావేశాలను ఏర్పాటు చేయడం సాధ్యం కాదని తెలిపారు.

మంత్రికి గోడు వెళ్లబోసుకుంటూ మందడంలో రైతు మృతి

(మొదటి పేజీ తరువాయి)

విషయమై ఇప్పటికే రెండుసార్లు సమావేశాలు జరిగాయి. ఎన్ 8 రోడ్డు నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోయే వారితో శుక్రవారం సిఆర్‌డిఎ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయం వద్ద అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ ఎ.భార్గవ్ తేజ హాజరయ్యారు.

అంతకుముందు సమావేశంలో గ్రామస్తుల్లో కొంతమంది మాట్లాడుతూ రోడ్ల కారణంగా గ్రామంలోని గుడులు తొలగించాలని చూస్తే ఊరుకోమన్నారు. మరికొంతమంది ఆలయాలు, ఇళ్ల తొలగించకుండా రోడ్డు నిర్మాణానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కోరారు. ఇళ్ల కోల్పోయేవారికి నష్టపరిహారం ఇస్తారని, ప్రత్యామ్నాయంగా కేటాయించే స్థలాలు వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు, మంత్రి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు సంతృప్తి చెందలేదు. దీంతో, రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పాత, కొత్త అలైన్‌మెంట్, ఇతర అంశాలపై మరోసారి మాట్లాడదామని చెప్పి సమావేశాన్ని ముగించారు.

హలో కార్మికా... చలో విశాఖ



అనంతపురం సర్వజన ఆస్పత్రి వద్ద జాతాను ప్రారంభిస్తున్న దృశ్యం





నంద్యాలలో జాతానుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఏసురత్నం

మహాసభకు తరలిరండి..

- అనంతపురం, సత్యసాయి జిల్లా జాతాల్లో నేతల పిలుపు

ప్రజాశక్తి - ఉమ్మడి అనంతపురం

విశాఖపట్నంలో జరిగే సిఐటియు మహాసభల్లో తామూ పాల్గొంటామంటూ కార్మికులు, ప్రజలు అనంతపురంలో స్వచ్ఛందంగా ముందుకు కదిలి వస్తున్నారు. అనంతపురం సర్వజనాసుపత్రి వద్ద ప్రారంభమయిన జాతా బుక్కరాయసముద్రం, నార్పల, యాడికి, తాడిపత్రి ప్రాంతాల్లో కొనసాగింది. జాతా వెళ్లిన ప్రతి ప్రాంతంలోనూ కార్మికులు ఘన స్వాగతం పలికారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ప్రారంభమైన జాతాను మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ జెండా ఊపి ప్రారంభించారు. కదిరి, ముదిగుబ్బ, ధర్మవరం, కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి వరకు జాతా కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో నాయకులు మహాసభల ఆవశ్యకతను తెలియజేస్తూ మహాసభలను విజయవంతం చేయాలంటూ ప్రజలు, కార్మికులకు పిలుపునిచ్చారు.

కదిలిన జాతాలు.. కదులుతున్న కార్మికులు

కార్మిక వర్గంలో చైతన్యాన్ని నింపుతూ...సిఐటియు మహాసభ ఆవశ్యకతను వివరిస్తూ పల్లె, పట్టణాల్లో ప్రచార జాతాలు మొదలయ్యాయి. శుక్రవారం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా, నంద్యాల, ఒంగోలు, విశాఖపట్నం, పల్నాడు తదితర జిల్లాల్లో జాతాలతో వాడవాడలా ప్రచారం హోరెత్తుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కార్మికుల్లో చైతన్యాన్ని నింపారు. జనవరి నాలుగన విశాఖపట్నంలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగసభను విజయవంతం చేయాలని, కార్మిక వర్గం తరలిరావాలని కోరారు. మన హక్కులను సాధించుకుందామని, శ్రమ దోపిడీ నశించాలని నినదించారు.

నంద్యాలలో ఆటో జాతా

ప్రజాశక్తి-పాములపాడు

విశాఖలో జనవరి నాలుగన జరిగే బహిరంగ సభకు లక్షలాది మంది ప్రజలను సమీకరిస్తూ మహాసభ జయప్రదానికి నంద్యాలలో ఆటోజాతా నిర్వహించారు. ప్రభుత్వాలు అవలంభిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలను వివరిస్తూ జాతాలు ముందుకు సాగాయి. ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, నందికొట్కూరు, జూపాడు బంగ్లాలో జాతాను నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు వి. యేసురత్నం మాట్లాడుతూ.. ఆటో జాత ద్వారా మహాసభపై అవగాహన కల్పించడం, ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామన్నారు. జనవరి 4న విశాఖ నగరంలో జరిగే బహిరంగ సభకు లక్షలాది మంది ప్రజలను సమీకరిస్తున్నట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ, కార్పొరేటర్ శక్తులకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాడి తెచ్చుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు.



విశాఖ మద్దిలపాలెం పరిసర ప్రాంతాల్లో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు కార్యకర్తలు

విశాఖలో వాడవాడలా ప్రచారం

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ ఉమ్మడి విశాఖ జిల్లాల్లో వాడవాడలా ప్రచారం హోరెత్తుతోంది. విశాఖ జివిఎంసి 60వ వార్డు శ్రీహరిపురం వాకింగ్ పార్కు నుంచి ఆటో ప్రచార జాతా చేపట్టారు. పారిశ్రామిక ప్రాంతమంతటా ప్రచారం సాగింది. సమస్యలపై అలుపెరగని పోరాటం చేయాలని కార్మిక వర్గాన్ని సమయాత్తం చేస్తున్నారు. మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన బైకు ర్యాలీని ప్రజాశక్తి జనరల్ మేనేజర్ కె.హరికిషోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ మద్దిలపాలెంలో ప్రారంభమై సత్యం జంక్షన్, సీతమ్మధార, హెచ్‌బి కాలనీ, వెంకోజీ పాలెం, ఎంవిపి.కాలనీ, వాల్తేరు, సిరిపురం మీదుగా సాగింది. సిఐటియు జోన్ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని ఫార్మా సిటీలోనూ, అచ్యుతాపురం ఎస్ఇజెడ్ రోడ్డులోనూ సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీలు నిర్వహిం చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పట్టణంలో వివిధ రంగాల కార్మికులు ఎర్రజెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. అరకులోయలో నిర్వహించిన బైకు ర్యాలీలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడారు. కొయ్యూరు మండల కేంద్రంలో కరపత్రాలు పంపిణీ చేశారు.



అల్లూరి జిల్లా పాడేరులో ప్రచారం నిర్వహిస్తున్న ముఠా కార్మికులు



కళా రూపాలతో కదలిక



కర్రసామును ప్రదర్శిస్తున్న సింహపురి స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు

ప్రజాశక్తి-నెల్లూరు

'పద...పద ... పద కార్మికా..! పదాతి దళమై కార్మికా...' అంటూ కళారూపాల్లో సిఐటియు మహాసభను జయప్రదం చేయాలంటూ నెల్లూరులో పిలుపునిస్తున్నారు. ముత్తుకూరు బస్టాండ్ సెంటర్ సమీపంలో సిఐటియు నగర కమిటీ ఆధ్వర్యంలో కళారూపాలతో సాంస్కృతిక ఉత్సవాలు'నెల్లూరు శ్రామిక ఉత్సవ్-2025' పేరుతో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు కోలాట ప్రదర్శన, పప్పుల వీధి హమాలీ కార్మికులు పండరీ భజన, క్లాసికల్ నృత్య ప్రదర్శన, నెల్లూరు అసోసియేషన్ ఈవెంట్ నృత్యరూపకం, సింహపురి స్పోర్ట్స్ అకాడమి వారిచే కర్రసాము, వివిద పాటలకు నృత్యరూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమం ఏదైనా దాని సారాంశం ఒక్కటే! శ్రామిక జనం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం సంఘటితం కావాలంటూ పిలుపులు! ప్రధాన రోడ్డు పైన ఒక పక్కగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంతో అటుగా పోతున్న ప్రజలు కాసేపు ఆగి చూస్తున్నారు. కళా రూపాల్లో శ్రమ జీవులు ఇస్తున్న పిలుపును వింటున్నారు. పెరుగుతున్న ధరల నుండి ప్రతి ఒక్క సమస్య ప్రస్తావనకు వస్తుండటంతోతాము ఎదుర్కొంటున్న కష్టాలతో పోల్చుకుంటున్నారు. ఈ సమస్యలపైనే కార్మిక యోధులు విశాఖలో జరుపుతున్న మేధోమధనానికి జయప్రదం చేయాలని, ముగింపు రోజు జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలన్న పిలుపునకు సానుకూలంగా స్పందిస్తున్నారు. సిఐటియు నాయకులు కత్తిశ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు మూలం ప్రసాద్, స్వర్ణా బాబురావు, అశోక్, ఏ కామాక్షి, జి.కామాక్షమ్మ, దామదర్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసులు, పి.సూర్యనారాయణ, జి.రాంబాబు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు విజయ్‌కుమార్, శేషయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.



అభ్యుదయ గీతాలతో కోలాటం







చీమకుర్తిలో ప్రచార జాతా

కార్మిక వ్యతిరేక విధానాలపై చైతన్యం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై చైతన్యాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లాల్లో ప్రచార జాతాలు ప్రారంభమయ్యాయి. ఒంగోలు డివిజన్ టంగుటూరులో ప్రారంభమైన ప్రచార జాతాను సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ జాతా సింగరాయకొండ, పొన్నలూరు, కొండెపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు మీదుగా సాగింది. పామూరులో మరో ప్రచార జాతాను సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ ప్రారంభించారు. ఈ జాతా కనిగిరి, పొదిలి, దరిశి, కురిచేడు, దొనకొండ, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పెదదోర్నాల, పెదారవీడు మీదుగా సాగి రాత్రికి మార్కాపురం చేరుకుంటుంది. శనివారం మార్కాపురం నుంచి తిరిగి ప్రారంభమయ్యే ఈ జాతా తర్లుబాడు, కంభం, రాచర్ల, గిద్దలూరు, బి.పేట, హనుమంతునిపాడు, వెలిగండ్ల మీదుగా సిఎస్.పురం చేరుకొని ప్రచార కార్యక్రమాలు నిర్వహించనుంది.

నరసరావుపేటలో కదులుతున్న శ్రమజీవులు

ప్రజాశక్తి - పల్నాడు

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ప్రచార జాతాను సిఐటియు రాష్ట్ర నాయకులు గుంటూరు విజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం జాతా చిలకలూరిపేట, వినుకొండ, కారంపూడి, దుర్గి, మాచర్లలో కొసాగింది. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, కౌలురైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ జాతాలో పాల్గొని మాట్లాడారు.



నరసరావుపేటలో జాతాను ప్రారంభించి మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్

హక్కుల కోసం పోరాడుదాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు నిర్వహించే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో శుక్రవారం నిర్వహించిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జనవరి నాలుగున మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శన, బహిరంగ సభలో అంగన్‌వాడీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ, జిల్లా ఉపాధ్యక్షులు బి.శాంతామణి, జల్లు కాంచన తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురం

సిఐటియు మహాసభ జయప్రదానికి పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో సిఐటియు ఆధ్వర్యాన విస్తృత ప్రచారం నిర్వహించారు. సాలూరు వైటిసి ఆవరణంలో జరిగిన అంగన్వాడీ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం శ్రీను పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికుల సమావేశం జరిగింది. బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68